



నూతన డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ కృష్ణ కాంత్, ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, బాలనాగిరెడ్డి

# ప్రజలకు మరిన్నీ సేవలు

**- ఎస్పీ కృష్ణకాంత్**
**- డీఎస్పీ కార్యాలయం ప్రారంభం**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

నూతన డీఎస్పీ కార్యాలయం ద్వారా ప్రజలకు మరిన్నీ సేవలు అందించడానికి ఉపయోగపడుతుందని ఎస్పీ జి.కృష్ణ కాంత్ తెలిపారు. ఆధునికరించీ నూతనంగా ఏర్పాటు చేసిన ఆదోని రహదారిలోని నీటిపారుల శాఖ అతిథి గృహంలో ఎమ్మిగనూరు సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఎస్పీ కృష్ణ కాంత్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం ఆఫీసర్ విజిటింగ్ బుక్‌లో సంతకం చేసి, డీఎస్పీ కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఎమ్మిగనూరు సబ్ డివిజన్ ఏర్పడిన తర్వాత ఎమ్మిగనూరు డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. సహాయ, సహాకారాలు అందించిన వారికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణ తర్వాత ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం ఎమ్మిగనూరు సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సబ్ డివిజన్ పరిధిలో ప్రజలకు ఏమైనా సమస్యలుంటే డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ స్థాయి అధికారికి విన్నవించుకోవచ్చన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మే 9న 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఆ కార్యక్రమానికి వచ్చే స్పందన ఫిర్యాదులపై కూడా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించే దిశగా ఎస్ఐ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రజల పట్ల పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అనంతరం ఎమ్మిగనూరు పట్టణ, గ్రామీణ, ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లను, పోలీసు క్వార్టర్స్‌ను ఎస్పీ పరిశీలించారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డి.ప్రసాద్, ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, సిఐలు మధుసూధన్ రావు, శ్రీనివాసులు, ఎరిషావలీ, వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, మండల కన్వీనర్ బసిరెడ్డి పాల్గొన్నారు.

# బటన్ నొక్కినా.. పడని డబ్బులు..

**- 70 శాతం మందికే నగదు జమ - వైఎస్ఆర్ ఆసరా లబ్ధిదారుల ఆందోళన**

**ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి**

సంక్షేమ పథకాల కింద ప్రభుత్వం జమ చేసే సొమ్ములు లబ్ధిదారులకు ఎప్పటికి జమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. సిఎం బటన్ నొక్కి నెలలు గడిచిపోతున్నా ఇప్పటి వరకూ సగమంది లబ్ధిదారులకు కూడా ఖాతాలకు సొమ్ము చేరలేదు. 45 రోజుల క్రితం బటన్ నొక్కి విడుదల చేసిన డ్వాక్రా సంఘాల ఆసరా సొమ్ము ఇప్పటికీ పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు చేరలేదు. దీంతో సంక్షేమ పథకాల లబ్ధిదారుల్లో ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది...

2019 ఏప్రిల్ 11వ తేదీ వరకూ ఉన్న డ్వాక్రా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు వైసిపి ప్రభుత్వం హామీ ఇచ్చింది. డ్వాక్రా సంఘాలకు చేసే ఈ ఆర్థిక సహాయానికి 'ఆసరా' పథకంగా ప్రభుత్వం నామకరణం చేసింది. రెండు విడతల సొమ్ము జమ చేయగా మూడో విడత సొమ్ము మార్చి 25న ఏలూరు జిల్లా దెందులూరులో సిఎం బటన్ నొక్కి విడుదల చేశారు. కర్నూలు జిల్లాలో 37,433 స్వయం సహాయక సంఘాలున్నాయి. వాటిలో 35,493 సంఘాల సభ్యులకు వైఎస్ఆర్ ఆసరా నగదు జమ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వారికి మూడో విడతగా రూ.91 కోట్లు జమ చేయాల్సి ఉంది. సిఎం బటన్ నొక్కిన తర్వాత ఎమ్మెల్యేలు అంతా వారివారి నియోజకవర్గాల్లో మెగా చెక్కుల పంపిణీ చేసి హడావుడి చేశారు. ఆసరా సొమ్ము విడుదలకు సంబంధించి సిఎం బటన్ నొక్కి 45 రోజులు గడిచింది. ఇప్పటి వరకూ 70 శాతం గ్రూపులకు మాత్రమే ఆసరా సొమ్ము జమ అయింది.



మిగిలిన గ్రూపులకు ఎప్పటికి జమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. డ్వాక్రా సంఘాల్లో 70 శాతానికిపైగా గ్రూపులకు నగదు జమైనట్లు తెలిసింది. ఆసరా డబ్బు జమకాకపోవడం డ్వాక్రా సభ్యుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇంకా డబ్బులు జమ కావడానికి 15 రోజులు పట్టవచ్చని అధికారులు చెబుతుండడంతో ఇదేం తీరంటూ డ్వాక్రా సంఘాల మహిళలు ప్రశ్నిస్తున్నారు.

**రైతు భరోసా, అమ్మఒడి పరిస్థితి ఏమిటి..?**

ఖరీఫ్ ఆరంభంలో రైతు భరోసా, స్కూల్స్ ప్రారంభమయ్యే నాటికి అమ్మఒడి పథకాలకు సంబంధించిన సొమ్ము విడుదల చేయాల్సి ఉంది. బటన్ నొక్కిన పథకాలకు సంబంధించిన సొమ్ములే ఇంకా జమ కాలేదు. బటన్ నొక్కాల్సిన పథకాల సొమ్ము ఎప్పటికి జమవుతుందోనన్న చర్చ లబ్ధిదారుల్లో కొనసాగుతోంది.

**అందరికీ జమ అవుతాయి..**

వైఎస్ఆర్ ఆసరా లబ్ధిదారులకు సంబందించి 95 శాతం మంది వివరాలు ఆన్‌లైన్ చేశాం. రోజుకు కొంత మందికి డబ్బులు పడుతున్నాయి. అందరికీ బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అవుతాయి.

**- వెంకటసుబ్బయ్య, డిఆర్‌డిఎ పీడీ.**

ఉపాధి హామీ రక్షణకు

# కూలీలు కదలిరండి

**- 22న కలెక్టరేట్ ముందు ధర్నాను జయప్రదం చేయండి**
**- వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

ఉపాధి హామీ చట్టం రక్షణకు ఈనెల 22న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాలో ఉపాధి కూలీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, సంఘం మండల నాయకులు బి. నాగరాజు కోరారు. గురువారం ఓర్వకల్లు మండలం కేతవరం లొద్దిపల్లె గ్రామాలలో ఉపాధి పనులను పరిశీలించి కరపత్రాలు పంపిణీ చేసి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం చట్టాన్ని ఎత్తివేయడానికి కుట్ర పన్నుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులు లేనప్పుడు ఉపాధి హామీ పథకం పేద ప్రజలకు ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. వేసవి కాలంలో ఏ పనులు దొరక్క వ్యవసాయ కూలీలు మొదలుకొని, డిగ్రీ చదువుకున్న యువతీ యువకుల వరకు ఉపాధి పనులకు వెళుతున్నారని అన్నారు.

**పాత పద్ధతిలోనే పనులు కొనసాగించాలి**

**కర్నూలు క్రైమ్:** ఉపాధి హామీ చట్టంలో భాగంగా కరువు పనులును గతంలో లాగానే కొనసాగించాలని, ఈనెల 22న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకటరాముడు, సిఐటియు మండల అధ్యక్షులు ఉషేనయ్య కోరారు. కర్నూలు మండలం, నందన పల్లె, గార్గేయపురం గ్రామాలలో ఉపాధి పనులను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి నిధులు ఈ సంవత్సరం 70 వేల కోట్లు తక్కువ కేటాయించారని, అందువలన కూలీలకు చాలా అన్యాయం జరిగిందని అన్నారు. సోమవారం కలెక్టరేట్ దగ్గర జరుగు ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

**తుగ్గలి:** జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు అన్ని సదుపాయాలను కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ అధ్యక్షులు శ్రీరాములు, సిఐటియు మండల కార్యదర్శి రంగస్వామి కోరారు. మండల పరిధిలోని గిరిగెట్ల గ్రామంలో ఉపాధి పనులను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఉపాధి పథకంలో పనిచేసే కూలీలకు ఫస్ట్ ఎయిడ్ బాక్స్, పనిముట్లను అందజేయాలని, అదేవిధంగా తాగునీటి సమస్యను తీర్చాలని వారు డిమాండ్ చేశారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న

# ఉర్దూ యూనివర్సిటీకి రూ.51 కోట్లు

**- ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్**

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

కర్నూలు ఉర్దూయూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.51 కోట్లు కేటాయించిందని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ హాఫీజ్ ఖాన్ తెలిపారు. గురువారం ఆయన రాయల్‌ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉర్దూ యూనివర్సిటీ కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రతిపాదనలు చేశారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక యూనివర్సిటీని ప్రకటించి ఎలాంటి నిధులు కేటాయించకుండా ప్రైవేటు భవనాల్లో నామమాత్రంగా నిర్వహిస్తుందన్నారు. తాజాగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఉర్దూ ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని ముస్లింల ఉన్నత చదువులను ప్రోత్సహించేందుకు ఉర్దూ యూనివర్సిటీకి ఏకంగా రూ.51 కోట్లను కేటాయించిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎపి స్టేట్ హస్‌కమిటీ డైరెక్టర్ మన్సూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

# చిరుధాన్యాలను ప్రోత్సహించాలి

**- కలెక్టర్ సృజన**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

మానవుల జీవన శైలిలో చిరుధాన్యాలు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ లోని డ్వాక్రా బజార్ మెయిన్ ఎంట్రెన్స్ వద్ద ఏర్పాటు చేసిన మిల్లెట్ ఎగ్జిబిషన్ ప్రోగ్రాంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎన్.మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... చిరుధాన్యాల వాడకం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలనే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించారని పేర్కొన్నారు. అందులో భాగంగానే చిరుధాన్యాల వంటకాలను ప్రోత్సహిస్తూ వాటి నుండి ఎటువంటి ఉత్పత్తులను తయారు చేసుకోవచ్చు అనే అంశాన్ని స్టాల్స్ రూపంలో ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. మన అందరి జీవన విధానాలు మారాయని, గతంలో మన పెద్దవాళ్లు చేస్తున్న శారీరక శ్రమ ఈ కాలం వారు చేయడం లేదని, అందుకే చిన్న వయస్సులోనే డయాబెటిస్, బిపి వంటి రోగాలు వస్తున్నాయన్నారు. మన జీవనశైలితో పాటు ఆహార శైలిలో కూడా మార్పు తీసుకొని రావడానికి చిరుధాన్యాలు మన జీవన శైలిలో చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయన్నారు. ఆహారంతో పాటు చిరుధాన్యాలు కూడా తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చనే విషయాన్ని అందరం తెలుసుకోవాలన్నారు. కేవలం కర్నూలు ప్రాంతానికే పరిమితం కాకుండా చిరుధాన్యాల ఉత్పత్తులను, చిరుధాన్యాలు పండించే రైతులను మరింత ప్రోత్సహించేందుకు ఏరియా విస్తీర్ణంతో పాటు మార్కెటింగ్ లో కూడా డెవలప్ చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అందులో భాగంగానే ఈ ఖరీఫ్ సీజన్లో కొంత ఏరియా వరకు మిల్లెట్ సాగు కొరకు ప్రణాళిక రూపొందించామని వాటిపైన వ్యవసాయ శాఖ వారు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అందులో భాగంగానే కార్యాలయాలలో జరిగే సమావేశాలలో కూడా స్నాక్స్ అందించే సమయంలో మిల్లెట్స్ ఏర్పాటు చేసే విధంగా ప్రతి ఒక్క అధికారి చర్యలు తీసుకోవాలన్నారు. మనల్ని చూసి ప్రైవేట్ కంపెనీలతో పాటు ఫంక్షన్స్‌లో కూడా మిల్లెట్స్ ఏర్పాటు చేస్తారన్నారు. కలెక్టరేట్ ఆవరణంలో మిల్లెట్ కేఫ్ ఏర్పాటు చేస్తున్నామని, అందులో మిల్లెట్ బ్రేక్ ఫాస్ట్, మిల్లెట్ లంచ్, స్నాక్స్ ఏర్పాటు చేసి ప్రజలకు త్వరలో అందుబాటులో తీసుకొని వస్తామని అన్నారు. ప్లాస్టిక్ ఉపయోగించడం వల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందన్నారు. వ్యవసాయ శాఖ, హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, డిఆర్‌డిఎ పిడి, మెప్మా పిడి అందరూ కలిసి సమన్వయంతో పని చేయాలన్నారు. అంతకుముందు ఎస్ హెచ్‌జిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్లెట్ స్టాల్స్‌ను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను అందజేస్తున్న కలెక్టర్ సృజన



## కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవాలి

**కోడుమూరు నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షులు ఎ.జయన్న**

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

ప్రతి ఒక్కరూ కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవాలని కోడుమూరు నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షులు ఆకెపోగు జయన్న అన్నారు. గురువారం కర్నూలు మండలం బి.తాండ్రపాడు పంచాయతీ పరిధిలోని టివి9 కాలనీలో పాఠశాలలో శాంతిరాం లేజర్ కంటి వైద్యశాల వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సదరు కంటి వైద్యశాలకు సంబంధించిన వైద్య నిపుణులు గ్రామ ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి పలు సూచనలను ప్రజలకు తెలిపారు. ఈ సందర్భంగా జయన్న మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రదానం మనిషి శరీరంలో అన్ని అవయవాల కంటే కళ్ళు అత్యంత ప్రధానమైనవని అన్నారు. కంటి ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరూ సంరక్షించుకోవాలన్నారు. కళ్ళు లేని జీవితం ఎంత దుర్భరమో ఊహించలేం అన్నారు. ప్రతి ఒక్కరు తరచుగా కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. పేదల కంటి ఆరోగ్యం కోసం ముందుకు వచ్చిన శాంతిరాం లేజర్ కంటి వైద్యశాల వారి సేవలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ సునీల్, ఇమామ్ బాబు, భరత్, రంజిత్ కుమార్, సాయి, స్థానిక గ్రామ టిడిపి నాయకులు ఏసు వెంకటేష్ యూసుఫ్ రసూల్ పాల్గొన్నారు.



## వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకొండి

**ప్రజాశక్తి- సి బెళగల్**

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ వెంకటరమణ పాఠకులను పుస్తక ప్రియులను కోరారు. గురువారం విద్యార్థులకు క్యారం, చెస్ వంటి ఆటలను ఆడించారు. ఇందులో ప్రతిభ చూపిన వారికీ వచ్చే నెల 11 న బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. వేసవిలో విజ్ఞానం పొందెందుకు ఈ శిబిరాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

# బిజెపి ఎంపిని అరెస్టు చేయాలి

**రెజ్లర్ల ఆందోళనకు మద్దతుగా ప్రజాసంఘాల సంతకాల సేకరణ**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రెజ్లర్ల క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఢిల్లీ జంతర్ మంతర్‌లో ఆందోళన చేస్తున్న రెజ్లర్లకు మద్దతుగా గురువారం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేశారు. కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి. అంజిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు గౌస్‌దేశాయి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడారు. దేశ ప్రతిష్టను పెంచడం కోసం అనేక పథకాలు సాధించిన రెజ్లర్ల క్రీడాకారులు 26 రోజులుగా ఢిల్లీలో ఆందోళన చేస్తుంటే ఏమి ఎరగనట్లు దేశ ప్రతిష్ట కోసం కృషి చేసిన వాళ్ల పట్ల నిర్లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈరోజు దేశవ్యాప్తంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో క్రీడాకారులకు మద్దతుగా నిరసన ప్రదర్శనలు సంతకాల సేకరణలు చేస్తున్నామని తెలిపారు. తక్షణమే లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్ రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బిజెపి ఎంపీపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరసింహులు, కుమార్ , ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు అమర్, ప్రజా సంఘాల నాయకులు గోపాల్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న గౌస్ దేశాయి

## ఆర్టిఫిషియల్ ఇంజనీరింగ్ కోర్స్‌కు అనుమతి

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

రాయలసీమ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలకు వచ్చే విద్యాసంవత్సరం నుండి (2023-2024) అదనంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కోర్సు మంజూరైనట్లు వర్సిటీ విసి ఎ.ఆనందరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కోర్సులో మొత్తం 60 సీట్లకు అనుమతి లభించిందన్నారు. దీంతోపాటు కంప్యూటర్ సైన్స్ విభాగంలో ప్రస్తుతమున్న 60 సీట్లను 120 సీట్లకు పెంచుకోవడానికి కూడా అఖిలభారత సాంకేతిక విద్యామండలి అనుమతించిందన్నారు. నూతన కోర్సు ప్రారంభంతోపాటు, అదనపు సీట్లకోసం వర్సిటీ అందజేసిన నివేదికను పరిశీలించిన నిపుణుల కమిటీ సూచనలమేరకు వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలకు ఈ కోర్సు మంజూరైనట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం రాయలసీమ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, సివిల్, మెకానికల్ విభాగాలలో 60 చొప్పున సీట్లు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కోర్సుతో మరింతమంది విద్యార్థులకు యూనివర్సిటీలో చదువుకొనే అవకాశం లభిస్తుందని ఆయన హర్షం వ్యక్తంచేశారు. ఇప్పటివరకు కేంద్రీయవిశ్వవిద్యాలయాల్లోనే అందుబాటులో ఉన్న ఇలాంటి అత్యాధునిక కోర్సులను రాయలసీమ విశ్వవిద్యాలయంలో కూడా ప్రారంభించడంతో మనయువతకూడా పోటీప్రపంచంలో నిలదొక్కుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కోర్సు వర్సిటీ కీర్తికి కలికితురాయిగా నిలుస్తుందన్నారు. ఈ విషయంలో కృషిచేసిన వర్సిటీ అధికారులకు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌కు, అధ్యాపకులు, సిబ్బందికి ఆచార్య ఆనందరావు శుభాకాంక్షలు తెలిపారు. సమిష్టిగా కృషిచేసి భవిష్యత్తులో మరిన్నికోర్సుల సాధనకు ప్రయత్నించాలన్నారు.



ట్రాక్టర్ నడుపుతున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

## రైతుల అభివృద్ధే వైసిపి ధ్యేయం : ఎమ్మెల్యే శ్రీదేవి

**ప్రజాశక్తి-తుగ్గలి**

మండల పరిధిలోని పెండేకల్లు గ్రామంలో శ్రీకాశీస్వామీ రైతు మిత్ర గ్రూపునకు వైఎస్ఆర్ యంత్ర సేవా ద్వారా మంజూరైన ట్రాక్టర్లను పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి గురువారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలం పరిధిలోని పెండేకల్లు గ్రామం చెందిన రైతు మిత్రు గ్రూపునకు రు.14.76 లక్షల విలువ చేసే ట్రాక్టరు, బుడ్డలమిషన్, రోటోవేటర్ పంపిణీ చేశామన్నారు. ముఖ్యమంత్రి జగన్ రైతులకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందన్న తపనతో రైతు సంక్షేమానికి పెద్దపీట వేశామన్నారు. అదేవిధంగా రైతు మిత్ర ద్వారా ట్రాక్టర్లను వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తున్నామన్నారు. వ్యవసాయ అధికారి పవన్ కుమార్, కెడిసిసి బ్యాంక్ మేనేజర్ మధుసూదన్, సొసైటీ అధ్యక్షులు అట్లా గోపాల్ రెడ్డి, సచివాలయం కన్వీనర్ అట్లా బసిరెడ్డి, విఎస్ఎ శివతేజ, రైతు ముద్ర గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.



ఆనాథ ఆశ్రమానికి పాలడబ్బాలు అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

## అనాథ అన్న భావన రాకూడదు

**ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

ముళ్ల పొదలు, చెత్త కుప్పలు నడిరోడ్డుపై పసిపిల్లలను వదిలేసిన ఘటనలు చోటు చేసుకోవడం వల్ల పేగు బంధాన్ని తెంచేసుకుంటున్న తల్లిదండ్రుల వల్ల అనాథగా మారిన పిల్లలను అక్కున చేర్చుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ సీనియర్ వైద్యులు శంకర్ శర్మ సూచించారు. గురువారం కర్నూలు నగరంలోని సిక్యాంప్ సెంటర్‌లో ప్రత్యేక దత్తత కేంద్రం, జిల్లా బాలల సంరక్షణ విభాగం, జిల్లా మహిళా , శిశు అభివృద్ధి సంస్థలో చిన్నా రులకు పాల డబ్బాలను, దుస్తులను డాక్టర్ శంకర్‌శర్మ అందచేశారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ అనాథఅన్న భావన వారిలో రాకుండా ఆప్యాయత, అనురాగం, ప్రేమను పంచుతూ సొంత బిడ్డల్లా చూసుకోవడం మంచిదేనన్నారు. ముక్కుపచ్చలారని పిల్లలు చెత్త కుప్పలో పడేయడం బాధాకరమన్నారు. మాతృ ప్రేమను నోచుకోని పసి మొగ్గలు, కన్నతల్లి మురి పాలకునోచుని ఈ శిశువులను పోషక లోపం అనారోగ్యం బారిన పడకుండా కాపాడు కోవాల్సి ఉందన్నారు. అనాథ చిన్నారులకు అమ్మ ప్రేమను అంది స్తున్న వారికి కృతజ్ఞతలు చెప్పారు.

## పోషకాహార పునరావాస కేంద్రం తనిఖీ

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**



కర్నూలు జిజిహెచ్‌లోనీ పోషకాహార పునరావాస కేంద్రానికి (ఎన్ఆర్‌సి) స్పెషల్ న్యూబార్న్ కేర్ (ఎస్ఎన్ఐసియు)లను జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ గురువారం తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాహార లోపంతో పోషకాహార పునరావాస కేంద్రానికి వచ్చిన పిల్లల తల్లిదండ్రులతో వారి పిల్లలకు అందుతున్న ఆరోగ్యసేవలు , అందిస్తున్న పోషకాహారం గురించి ఆరా తీశారు. అంతేకాకుండా పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పక ఇప్పించాలని కోరారు. స్పెషల్ న్యూబార్న్ కేర్‌లో పిల్లలకు అందుతున్న ఆరోగ్య సేవలను పరిశీలించారు. పోషకాహార పునరావాస కేంద్రానికి స్పెషల్ న్యూబార్న్ కేర్‌ల రిపోర్ట్, రికార్డ్స్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కర్నూలు, చిన్న పిల్లల విభాగాపతి డాక్టర్ విజయానందం బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రికార్డులు సక్రమంగా లేకపోతే చర్యలు

**- ఎడిఎలు సునీత, మోహన్ విజయ్‌కుమార్**


రికార్డులను పరిశీలిస్తున్న ఎడిఎ సునీత

**ప్రజాశక్తి - దేవనకొండ**

సీడ్స్, పెస్టిసైడ్స్ ఎరువుల దుకాణాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆలూరు ఎడిఎ సునీత, పత్తికొండ ఎడిఎ మోహన్ విజయ్ కుమార్ హెచ్చరించారు. గురువారం దేవనకొండలో ఎఒ సురేష్ బాబు ఆధ్వర్యంలో సీడ్స్, ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. మన గ్రోమోర్ సెంటర్ ఎరువుల దుకాణంలో సీడ్స్ రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేకపోవడంతో రూ.5.65 లక్షల విలువ చేసే పత్తి విత్తనాల అమ్మకాల నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి రైతుకూ బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని, డీలర్స్ టూ డీలర్స్ విత్తనాలు అమ్మకూడదని సూచించారు. రైతులు ఎవరూ లూజు విత్తనాలు కొనుగోలు చేయకూడదన్నారు. విత్తనాలు కొన్న రసీదు, ప్యాకెట్ పంట చివరి వరకు దగ్గర ఉంచుకోవాలని తెలిపారు. ఎవరైనా లూజు విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎఇఒ జయరాం, యోగి, రంగన్న పాల్గొన్నారు. **ఆలూరు** పట్టణంలోని ఎరువుల దుకాణాలను పత్తికొండ, ఆలూరు ఎడిఎలు విజయ మోహన్, సునీత తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఎఒ వెంకటేశ్వర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## స్టాక్ పాయింట్ తనిఖీ


నిల్వలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని పౌర సరఫరాల గోడౌన్ పాయింట్‌ను గురువారం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న రేషన్ నిల్వ, రికార్డులు, భద్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బియ్యం కార్డుదారులకు పంపిణీ చేసే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. తహశీల్దార్ వెంకట లక్ష్మీ, పౌర సరఫరాల ఉప తహశీల్దార్ వలి బాషా ఉన్నారు.

### నాణ్యమైన పత్తి విత్తనాలను
## ప్రభుత్వమే సరఫరా చేయాలి

**- ఎపి రైతు సంఘం**


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**ప్రజాశక్తి - ఆస్పరి**

మండలంలో నకిలీ పత్తి విత్తనాలను అరికట్టి నాణ్యమైన పత్తి విత్తనాలను ప్రభుత్వమే సరఫరా చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు, మండల అధ్యక్షులు మధు రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రైతు సంఘం అధ్వర్యంలో స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఎంపిఇఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతేడాది నకిలీ పత్తి విత్తనాల వల్ల మండలంలో వేల ఎకరాల పత్తి పంట దెబ్బతినిందని తెలిపారు. రైతులకు పెట్టుబడి కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం బీమా కూడా రాక రైతులు నష్టపోయారని తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లో నకిలీ పత్తి విత్తనాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని చెప్పారు. వ్యవసాయ అధికారులు నకిలీ విత్తనాలు అమ్ముతున్న దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్‌బికెలో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రైతు సంఘం నాయకులు తిప్పన్న, రాందాస్, మహానంది, చెన్నయ్య, బసి రెడ్డి, తిమ్మన్న, నాగన్న పాల్గొన్నారు.

## ఇమ్రాన్‌ను ఆదోనికి తీసుకురావాలి

**- సబ్ కలెక్టర్‌కు జర్నలిస్టుల వినతి**

**ప్రజాశక్తి - ఆదోని**

కుటుంబ పరిస్థితులు సరిగా లేక ఆదాయం కోసం దుబాయి వెళ్లి మోసపోయిన ఇమ్రాన్‌ను ఆదోనికి తీసుకురావాలని జర్నలిస్టులు కోరారు. గురువారం జర్నలిస్టులు శ్రీనివాసులు, బసవ, రవి, విజయ్, కాసీం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇమ్రాన్ ఆర్థికంగా స్థిరపడాలని కర్ణాటక రాష్ట్రానికి చెందిన సయ్యద్ అనే ఏజెంట్‌ను సంప్రదించి దుబాయ్‌కు మార్చి 30న వెళ్లారని తెలిపారు. వెళ్లినప్పటి నుంచి 45 రోజులు గడిచినా ఏ పని చూపించకుండా గదిలోనే ఉంచి పాస్ పోర్టును లాక్కొని అడిగితే కూడా ఇవ్వకుండా ఈ రోజు, రేపు అని వారించి కాలయాపన చేస్తున్నారని ఇమ్రాన్ సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో ద్వారా షేర్ చేశారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం దుబాయ్‌లోని ఎంబసీతో సంప్రదించి భారత దేశానికి వచ్చేలా చూడాలని కోరారు.

అగ్రహారంలో

# మొదటికొచ్చిన శ్మశాన సమస్య

**- నకిలీ పట్టాలతో స్టే తెచ్చిన భూస్వామి**
**- స్పందించని అధికారులు**
**- సచివాలయం ముందే గుంతతీసిన గ్రామస్తులు**


శ్మశాన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

మండలంలోని బి.అగ్రహారం గ్రామంలో చాలా ఏళ్లుగా అంతక్రియలు నిర్వహించేందుకు స్థలం లేక శ్మశాన సమస్యను గ్రామస్తులు ఎదుర్కొంటున్నారు. గత కొద్ది నెలల క్రితం ఒక దళిత యువకుడు మృతి చెందడంతో శ్మశానం కోసం దళితులంతా ఆందోళన చేపట్టారు. గ్రామంలోని సర్వే నెంబరు 244/1లో 44 సెంట్ల స్థలాన్ని దళిత శ్మశాన వాటికకు కేటాయించామని రెవెన్యూ అధికారులు తెలియజేయడంతో అక్కడ అంత్యక్రియలు నిర్వహించి, అంబేద్కర్ చిత్రపటంతో శ్మశాన వాటిక బోర్డు ఏర్పాటు చేసుకొని చుట్టూ కంచె వేసుకున్నారు. కొద్ది రోజులకే బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళ మృతి చెందారు. మళ్లీ శ్మశాన సమస్య తలెత్తడంతో దళితులకు కేటాయించిన భూమి పక్కనే ఉన్న మిగులు భూమిలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోగా పక్కనే ఉన్న పొలం యజమాని అభ్యంతరం తెలిపాడు. గ్రామస్తులు నాలుగు రోడ్ల కూడలిలో మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేపట్టారు. రెవెన్యూ, పోలీసు అధికారులు రంగ ప్రవేశం చేసి దళితులకు కేటాయించిన శ్మశాన వాటిక భూమి పక్కనే మిగులు భూమిలో అంత్యక్రియలు నిర్వహింపజేశారు. కొద్ది రోజుల తర్వాత పొలం యజమాని భూస్వామి రామేశ్వర రెడ్డి శ్మశాన స్థలంపై తనకు పట్టా ఉందని హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. దళితులు ఏర్పాటు చేసుకున్న బోర్డులో అంబేద్కర్ చిత్రపటానికి సిమెంట్ పూసి, వారు ఏర్పాటు చేసుకున్న కంచెను పీకి వేశారని పోలీసు స్టేషన్‌లో దళితులు ఫిర్యాదు కూడా చేశారు. దీనిపై పోలీసులు కేసు కూడా నమోదు చేశారు.

**చాకలి ఆదెమ్మ మృతితో మొదటికొచ్చిన సమస్య**

గురువారం గ్రామంలో చాకలి ఆదెమ్మ అనే మహిళ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు ఏర్పాటు చేసుకున్నారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గతంలో అంత్యక్రియలు నిర్వహించిన స్థలంలో హైకోర్టు స్టే ఉన్నందున వేరే చోట అంతక్రియలు నిర్వహించుకోవాలని సూచించడంతో గ్రామస్తులు ఆందోళనకు పూనుకున్నారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్, బీఎస్పీ జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, ఎర్రన్న, ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తుల తరపున ఆందోళనకు దిగారు. ఆగ్రహం చెందిన గ్రామస్తులు, మహిళలు గ్రామంలోని గ్రామ సచివాలయం ఎదుట గుంతను తీసి మృతదేహాన్ని పూడ్చేందుకు పూనుకున్నారు. సమస్య తీవ్రం కావడంతో వేణుగోపాల్, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు రంగ ప్రవేశం చేసి గతంలో అంత్యక్రియలు నిర్వహించిన స్థలంలోనే అంత్యక్రియలు నిర్వహింపజేస్తామని హామీ ఇచ్చారు. మృతదేహాన్ని తీసుకొని పాత స్థలం దగ్గరకు చేరుకున్నారు. తిరిగి అక్కడ కొలతల పేరుతో కాలయాపన చేయడంతో గ్రామస్తులు తిరిగి ఆందోళనకు దిగారు. రెవెన్యూ అధికారులు పాత స్థలంలోనే అంత్యక్రియలు నిర్వహింపజేయడంతో సమస్య సద్దుమణిగింది.

**స్టే రద్దుకు చర్యలు తీసుకుంటాం : తహశీల్దార్ వేణుగోపాల్**

శ్మశానానికి కేటాయించిన స్థలం పక్కన భూస్వామి తెచ్చిన స్టేను రద్దు చేయించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. ఆయనకు ములుగుందం గ్రామంలో కూడా చాలా భూములు ఉన్నాయని, ఆయన సమర్పించిన పట్టాలు కూడా చెల్లుబాటు కావని తెలిపారు. త్వరలో కోర్టులో కౌంటర్ వేసేందుకు తగిన దస్త్రాలు తయారు చేశామని తెలిపారు. ఎమ్మిగనూరు టౌన్ సిఐ మధుసూదన్, పెదకడబూరు ఎస్ఐ శ్రీనివాసులు, ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ నిరంజన్ రెడ్డి, రైతు సంఘం నాయకులు నరసింహులు, కెవిపిఎస్ గ్రామ నాయకులు బాలస్వామి, రంగస్వామి, బాలరాజు పాల్గొన్నారు.


సచివాలయం ముందు గుంత తీస్తున్న గ్రామస్తులు


సంక్షేమ ఫలాలను వివరిస్తున్న జగన్మోహన్ రెడ్డి

## పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

**- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

పేదరిక నిర్మూలన వైసిపి ప్రభుత్వ లక్ష్యమని వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని 14వ వార్డు సచివాలయంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి హయాంలో ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి చేకూరుతోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీల మేరకు నవరత్నాల పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇంకా అర్హత ఉండి పథకాలు అందని వారుంటే వాలంటీర్ల ద్వారా దరఖాస్తులను సచివాలయాల్లో అందజేస్తే పథకాలు మంజూరవుతాయన్నారు. ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో పట్టణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వార్డు పరిధిలో సిసి రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.

## ప్రజలకు అండ సంక్షేమ పథకాలు

**- వైసిపి యువనేత ప్రదీప్ రెడ్డి**

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంజూరు చేసే సంక్షేమ పథకాలు ప్రజలకు అండగా ఉంటాయని, జగనన్నకు ప్రజలు అండగా ఉంటారని వైసిపి రాష్ట్ర యువజన విభాగం నాయకులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మాలపల్లి గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి వివరించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.


బుక్‌లెట్‌ను అందజేస్తున్న ప్రదీప్‌రెడ్డి

జగన్మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదని తెలిపారు. అనంతరం గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జ్ విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

## 'మాఫియా అంతం వరకైనా సిఐ శ్రీరామ్‌ను కొనసాగించాలి'

**ఆదోని :** పట్టణంలో బెట్టింగ్ మాఫియాను అంతం చేసే వరకైనా ఆదోని త్రీ టౌన్ సిఐగా శ్రీరామ్‌ను కొనసాగించాలని ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎ.నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బెట్టింగ్‌లపై అరెస్టుల పర్వం కొనసాగుతున్న సమయంలో విచారణ చేస్తున్న సిఐ శ్రీరామ్‌ను హఠాత్తుగా విఆర్‌కు పంపడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఎన్నో కేసులను త్వరగా ఛేదించి బాధితులకు న్యాయం చేసిన నిజాయితీ అధికారి సిఐ శ్రీరామ్ అని కొనియాడారు. కేవలం ఐదు నెలల్లోనే ఆదోని నుంచి దూరం చేయడం ఆదోని పట్టణ ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారని తెలిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి సిఐ శ్రీరామ్‌ను ఆదోని త్రీ టౌన్ సిఐగా పంపాలని కోరారు. జికె.ఆంజినేయులు, సయ్యద్ వసీమ్, సాహెబ్ పాల్గొన్నారు.

# రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దు

**- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి**
**-ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.7 లక్షల మంజూరు**

**ప్రజాశక్తి - మంత్రాలయం**

రైతులు ఎవరూ అధైర్య పడి ఆత్మహత్యలు చేసుకోవద్దని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సూచించారు. గురువారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందిన ఆర్థిక సహాయాన్నిమృతుని భార్య లక్ష్మికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అందజేశారు. నియోజకవర్గంలోని కౌతాళం మండలం మేళిగనూరు గ్రామంలో రైతు ఆత్మహత్య చేసుకున్నారు. రైతు భరోసా పథకంలో భాగంగా ఆత్మహత్య చేసుకున్న ప్రతి రైతు కుటుంబాన్నీ ఆర్థికంగా ఆదుకునేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బాధిత కుటుంబానికి రూ.7 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. దేవరమనే జగదీష్ భార్య లక్ష్మీకి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా జగదీష్ భార్య లక్ష్మి మాట్లాడుతూ... తన భర్త ఆత్మహత్య చేసుకోవడంతో తాను, తన ముగ్గురు కుమారులు దిక్కు తోచని స్థితిలో ఉన్నామని, ఎమ్మెల్యే తమకు మాట ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన ప్రకారం తమకు రూ.7 లక్షల ఆర్థిక సహాయం అందించారని చెప్పారు. ఎమ్మెల్యేకు శాలువా, పూలమాల వేసి కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి నదిచాగి గ్రామ నాయకులు రామన్నగౌడ, ఎంపిటిసి లింగన్న గౌడ, ఉప సర్పంచి నాగేశ, కాంతయ్య పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి


జెసిబి ద్వారా ముళ్లకంపను తొలగిస్తున్న అధికారులు

## జగనన్న కాలనీలో ముళ్లకంప తొలగింపు

**ప్రజాశక్తి - చిప్పగిరి**

చిప్పగిరి జగనన్న కాలనీలో ముళ్లకంపలతో నిండి ఉన్న నేపథ్యంలో తొలగించారు. గురువారం ఎంపిడిఒ సుధాకర్ రాజు, సర్పంచి గోవిందరాజులు, హౌసింగ్ ఎఇ భవ్య, పంచాయతీ కార్యదర్శి బాలన్న ఆధ్వర్యంలో జెసిబి ద్వారా ముళ్లకంప తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అధికారుల ఆదేశాల మేరకు థర్డ్ పార్టీకి చెందిన కాంట్రాక్టుదారులు జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకొచ్చారన్నారు. ఈ నేపథ్యంలో జగనన్న కాలనీలో లోతుగా ఉన్న రాళ్లను, ముళ్లకంపను తొలగించి నీటి సౌకర్యానికి తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. లబ్ధిదారులందరూ థర్డ్ పార్టీ వారితో ఇల్లు నిర్మించుకోవడానికి ముందుకు రావాలన్నారు.

## ఒహెచ్ఆర్ ట్యాంకులు శుభ్రం



**ప్రజాశక్తి - పెద్దకడబూరు**

పెద్దకడబూరులోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం దగ్గర ఉన్న ఒహెచ్ఆర్ ట్యాంకు, శ్రీరామలింగేశ్వర దేవాలయం వద్ద ఉన్న ఒహెచ్ఆర్ ట్యాంకులను గురువారం సిబ్బంది శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచి రామాంజనేయులు మాట్లాడారు. గ్రామస్తులకు రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు.

## అసౌకర్యాలకు నిలయం ఆదోని రైల్వే స్టేషన్ : కాంగ్రెస్

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఆదోని రైల్వే స్టేషన్ ప్రయాణికులకు అసౌకర్యాల నిలయంగా మారిందని నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యులు నీలకంఠప్ప, పట్టణ కాంగ్రెస్ కార్యనిర్వహణ అధ్యక్షులు దిలీప్ ఢోకా తెలిపారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. రోజూ రూ.1.50 లక్షలకుపైగా ఆదాయం ఉన్నా ప్రయాణికుల సౌకర్యాలు మాత్రం సున్నాగానే ఉందన్నారు. రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల కోసం లిఫ్ట్ సౌకర్యం కల్పిస్తామని చెప్పి మరిచిపోయారన్నారు. ఇటీవల ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి రైల్వే బోర్డు మెంబర్‌గా ఎంపికయ్యారని తెలిపారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతి రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి సాయినాథ్, యువజన నాయకులు దేవిశెట్టి వీరేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఇసుక వ్యాపారాన్ని మానుకోవాలి

**- గురురాజ్ దేశాయ్**

**ప్రజాశక్తి - నందవరం**



ప్రకృతి సిద్ధమైన ఇసుకను ప్రభుత్వం వ్యాపారంగా మార్చుకోవడం సరైన పద్ధతి కాదని దేశాయ్ నెట్‌వర్క్ అధినేత గురురాజ్ దేశాయ్ తెలిపారు. గురువారం అయిన విలేకరులతో మాట్లాడారు. సహజ సిద్ధమైన వనరుల్లో ఒకటైన ఇసుకను రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందకుండా వ్యాపార దృష్టితో చూస్తోందని తెలిపారు. దళారులకు, బడా నాయకులకు రూ.కోట్లలో కాసుల వర్షం కురిపిస్తూ సామాన్యులను ఇబ్బందులకు గురి చేయడం బాధాకరమన్నారు. ప్రకృతి వనరులకు విఘాతం కలుగకుండా ఇసుకను వాడుకోవడానికి ప్రతి వ్యక్తికీ హక్కు ఉందని తెలిపారు. ఇలాంటి వాటిపై ప్రభుత్వం కొంత పన్ను విధించి వదిలి వేయాలని చెప్పారు. ఇసుకతో వ్యాపారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అప్పట్లో బ్రిటీష్ వారు ఉప్పు మీద విపరీతమైన పన్ను వేయడం వల్ల ఉప్పు సత్యాగ్రహం చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఇప్పటి ప్రజలు ఎంతవరకు మహాత్మ గాంధీలాగా శాంతియుతంగా పోరాడతారని, ఎంతో మంది కార్మికులు ఇసుక అందుబాటులో లేని కారణంగా రోడ్డుమీద పడ్డారని చెప్పారు. ప్రజలతో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఏం చేస్తున్నారని నిలదీశారు. ప్రజల నిరసన జ్వాలలు పెరిగి ప్రజాగ్రహానికి గురి కాకుండా ఉండాలంటే ప్రభుత్వం తక్షణమే ఇసుక వ్యాపారాన్ని వదిలి ప్రజలకు ఇసుకను సరసమైన ధరలోనే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ప్రజల సహకారంతో, వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఇసుక వ్యాపారాన్ని నిరసన జ్వాలలతో అడ్డుకుంటామని హెచ్చరించారు. మాజీ సర్పంచి రామన్నగౌడు, దేశాయ్ యూత్ అధ్యక్షులు సాధిక్, ఉపాధ్యక్షులు జముకల రవి, తోట పాండు, కె.శివన్న, పోతప్ప, రఘు, ఖాజా, నాసిర్, వాజిద్, సందీప్ పాల్గొన్నారు.

# బీసీ పాయింట్ నిర్వాహకుని బాగోతం

**- పొదుపు డబ్బులను స్వాహా చేసిన వైనం...**

**ప్రజాశక్తి - కోసిగి రూరల్**

ఒకే సారి డబ్బు సంపాదించాలని అనుకున్నాడో ఏమో పాపం ఆ వ్యక్తి పొదుపు మహిళలనే టార్గెట్ చేశాడు. పొదుపు మహిళలు అప్పు కట్టడానికి ఇచ్చిన డబ్బులను బ్యాంకుకు కట్టకుండా ఖాతాదారులకు పేపర్‌పై సీల్ వేసి సంతకం చేసి పంపించేవాడు ఓ ఎస్‌బిఐ బ్యాంకుకు సంబంధించిన బీసీ పాయింట్ నిర్వాహకుడు నీలి నరసింహులు. ఈయన బాగోతం వెలుగులోకి రావడంతో ఎస్‌బిఐ మేనేజర్, బీసీ పాయింట్ నిర్వాహకుని ఐడిని లాక్ చేశారు. బీసీ పాయింట్ బంద్ కావడంతో పొదుపు మహిళలు, బ్యాంకు ఖాతాదారులు తమ ఖాతాలను చెక్ చేసుకోవడానికి మేనేజర్‌ను కలిశారు. మినీ స్టేట్‌మెంట్ తీసేసరికి బీసీ పాయింట్ నిర్వాహకుని బాగోతం బయటపడింది. ఖాతాదారులు లబోదిబోమంటున్నారు.

బీసీ పాయింట్ నిర్వాహకుడు చేసిన నిర్వాకానికి ఎస్‌బిఐ అధికారులు తలదించుకునే పరిస్థితి ఎదురైంది. కోసిగిలో వందలాది పొదుపు గ్రూపులున్నాయి. నెలనెలా పొదుపుతో పాటు అప్పు చెల్లించడానికి వచ్చిన పొదుపు మహిళలను టార్గెట్ చేశాడు. అప్పుతో పాటు పొదుపు కట్టడానికి వచ్చిన మహిళలకు పేపర్‌పై సంతకం, సీల్ వేసి డబ్బులు కట్టినట్లు రిసీప్ట్ ఇచ్చి పొదుపు మహిళలను మోసం చేస్తున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. కోసిగిలోని శివ పొదుపు గ్రూపునకు చెందిన మహిళలు రూ.10 వేలు పొదుపు అప్పునకు జమ చేయాలని ఇస్తే, జమ చేయకుండా పేపర్‌పై సీల్ వేసి సంతకం చేసి బీసీ పాయింట్ నిర్వాహకుడు డబ్బులు దండుకుంటున్నారని శివ పొదుపు గ్రూపు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటేశ్వర్ పొదుపు గ్రూపు మహిళలు రూ.22 వేలు పొదుపు ఖాతాకు జమ చేయమని ఇస్తే రూ.2 వేలు మాత్రమే జమ చేసి మోసం చేశాడని తెలిసింది. మరో పొదుపు గ్రూపు మహిళలు రూ.27,500 పొదుపు ఖాతాకు జమ చేయమని వెళితే రూ.7,500 మాత్రమే ఖాతాకు జమ చేసి మోసం చేశాడని పేర్కొన్నారు. ఎస్‌బిఐ మేనేజర్ గమనించి బీసీ పాయింట్ నిర్వాహకుని ఐడిని లాక్ చేశారని సమాచారం. ఈ విషయం ఆ నోట ఈ నోట తెలియడంతో కోసిగి ఊరు వాకిలి దగ్గర ఉన్న బీసీ పాయింట్‌లో కట్టిన ఖాతాదారులు తమ అకౌంటుకు సంబంధించి మినీ స్టేట్‌మెంట్ కోసం క్యూ కట్టినట్లు తెలిసింది. దాదాపు లక్షలాది రూపాయలు ఖాతాలోకి వేయకుండా బీసీ పాయింట్ నిర్వాహకుడు పొదుపు ఖాతాదారులను మోసం చేశాడన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. తాము కట్టిన డబ్బులను తిరిగి ఇప్పించాలని, లేదా తమ పొదుపు అప్పుకు జమ చేయాలని ఖాతాదారులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎస్‌బిఐ మేనేజర్ అనిల్ కుమార్‌ను వివరణ కోరగా... ఖాతాదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసింహులు బీసీ పాయింట్ బీసీ కరస్పాండెంట్ నుంచి పూర్తిగా తొలగించి బీసీ ఐడిని క్లోజ్ చేశామన్నారు. ఆ బీసీ పాయింట్‌కు సంబంధించి లావాదేవీలో ఏవైనా సమస్యలుంటే ఖాతాదారులు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.


విలేకరుల ముందు వాపోతున్న పొదుపు మహిళలు

# ఉపాధి నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

**- వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న**
**-22న కలెక్టరేట్ ముందు ధర్నా**

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి, ఉపాధి కూలీలకు దక్కకుండా చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూలీలపై ఉందని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న తెలిపారు. గురువారం మండలంలోని జాలమంచి గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడారు. రెండు పూటల పని విధానాన్ని రద్దు చేయాలని, ఆన్‌లైన్ మస్టర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. పాత పద్ధతిలోనే పనులు కొనసాగించాలని, పని దగ్గర నీళ్లు, నీడ, టెంటు, మెడికల్ కిట్లులాంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మర్ అలవెన్స్ 50 శాతం ఇవ్వాలని, గడ్డపార సాన పెట్టుకోవడానికి రూ.50, రూ.600 వేతనం, 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకు ఈనెల 22న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. **కోసిగి (రూరల్)** మండలంలోని దొడ్డి బెళగల్ గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించి, ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతు సంఘం, సిఐటియు నాయకులు రాముడు, వీరేష్ మాట్లాడారు. ఈనెల 22న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాలో ఉపాధి కూలీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


ఆదోనిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న లింగన్న

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు

**- వన్ టౌన్ సిఐ విక్రమ్ సింహా**

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే, అలాంటి వారి సమాచారం ఇవ్వాలని, చర్యలు తీసుకుంటామని వన్ టౌన్ సిఐ విక్రమ్ సింహా కోరారు. గురువారం పట్టణంలోని జామియా మసీదు వెనుక ప్రాంతంలో సిబ్బందితో దాడులు నిర్వహించి ముగ్గురు మట్కా బీటర్లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మట్కా బీటర్లు ఇస్మాయిల్, కన్నయ్య, శ్రీనివాసులును అదుపులోకి తీసుకుని వారి నుంచి మట్కా చీటీలు, రూ.1.20 లక్షల నగదు, 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఇక్బాల్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. అక్రమ సారా, కర్ణాటక మద్యం అక్రమ రవాణా, క్రికెట్ బెట్టింగ్, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారాన్ని 9121101135 ద్వారా పోలీసులకు అందిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. సిబ్బంది రంగస్వామి, హెచ్‌సి మద్దిలేటి, సుధీర్, మధు, వెంకటేష్, ముస్తాక్ ఉన్నారు.


నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన సిఐ

## రైతుల వద్దకు ప్రభుత్వ సేవలు

**- వైసిపి నాయకులు సీతారామిరెడ్డి**

**ప్రజాశక్తి - మంత్రాలయం**



వ్యవసాయ శాఖాధికారులతో సీతారామిరెడ్డి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో రైతుల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని వైసిపి నాయకులు, ఎమ్మిగనూర్ ఆర్‌టిసి డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వై.సీతారామిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని బూదూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఆర్‌బికెను నిర్మించి స్థానిక రైతులకు లాభసాటి వ్యవసాయంపై సూచనలు, సలహాలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు అందుబాటులో ఉంచుతారని చెప్పారు. ఉపాధి హామీ చట్టం కింద రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్‌బికె పండితుల వేద మంత్రాల మధ్య రిబ్బన్ కట్ చేసి భవనంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయనకు స్థానిక వైసిపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వ్యవసాయ అధికారులు కూడా ఆయనకు, వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డికి, ఇన్‌ఛార్జ్ విశ్వనాథ్ రెడ్డికి, ఎంపిడిఒ ప్రభావతికి శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. ఉపాధి ఎపిఒ తిమ్మారెడ్డి, పిఆర్ ఎఇ నరసింహులు, ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ జీరా గణేష్, ఎఇఒ నరసింహుడు, నారాయణ రెడ్డి, జక్కయ్య, ఎస్ఐ వేణు గోపాల్ రాజు పాల్గొన్నారు.

## ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలి

**- సిపిఎం పట్టణ నాయకులు రాముడు**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**



సమావేశంలో మాట్లాడుతున్న రాముడు

పట్టణంలోని శివారు ప్రాంతాల్లో తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సిపిఎం పట్టణ నాయకులు బి.రాముడు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణ శివారు ప్రాంతాల్లో ప్రజలు తాగునీరు లేక అవస్థలు పడుతున్నారన్నారు. ప్రజల నుంచి ఇంటి, చెత్త పన్ను అన్ని రకాల పన్నులు వసూలు చేస్తూ సౌకర్యాలు కల్పించడంలో మున్సిపల్ అధికారులు వైఫల్యం చెందారన్నారు. ప్రతినెలా మున్సిపల్ సమావేశం జరుగుతున్నా సమస్యలు చర్చించడం లేదని తెలిపారు. 80 శాతం రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. వేసవి కాలమంటే అధికారుల్లో ముందు చూపు లేకపోవడంతోనే ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు బి.రాజు, సి.వీరేష్, డి.రవికుమార్, ఎ.సురేష్ కుమార్, బి.రాజు, ఎం.అబ్దుల్లా పాల్గొన్నారు.

## టిబి వ్యాధిపై అవగాహన సదస్సు

**ఆదోని :** పట్టణంలోని మండిగిరి ఎడబ్ల్యుడబ్ల్యు సెంటర్ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు డాక్టర్ షేకూన్ బాను, డాక్టర్ ఈశ్వర్ చంద్ర, ఎంపిహెచ్ఎస్ బాబురాజు ఆధ్వర్యంలో గురువారం టిబి వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెండు వారాలపాటు దగ్గు ఉన్నట్లయితే టిబిగా అనుమానించాలని తెలిపారు.





బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలని నిరసన తెలుపుతున్న నాయకులు

# బిజెపి ఎంపీని అరెస్ట్ చేయాలి

**- మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలి - జెవివి, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన**

**ప్రజాశక్తి - నంద్యాల**

ఢిల్లీలో ఆందోళన చేపడుతున్న మహిళా రెజ్లర్లకు న్యాయం చేసి, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను కఠినంగా శిక్షించి అరెస్టు చేయాలని జెవివి, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. మహిళా రెజర్లకు మద్దతుగా గురువారం నంద్యాలలోని నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్‌లో, నూనెపల్లె ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ క్రింద జెవివి, విజ్ఞాన కేంద్రాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా అధ్యక్షుడు జి.నాగరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.నాగరాజు మాట్లాడారు. రెజ్లర్స్ ఫెడరేషన్‌లోని కొంతమంది అధికారుల హింసాత్మక, లైంగిక వేధింపులు, అణచివేతకు వ్యతిరేకంగా ఢిల్లీలో అంతర్జాతీయ అవార్డు గ్రహీతలతో సహ మహిళా రెజ్లర్లు చేస్తున్న పోరాటం, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ దురహంకార నిష్క్రియాత్మకతపై దేశం మొత్తం దృష్టిని ఆకర్షించిందన్నారు. చీఫ్ ఆఫ్ రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెజ్లర్ల పోరాటానికి మరింత పదును పెట్టేందుకు సిఐటియు, ఏఐకెఎస్, ఏఐఏడబ్ల్యూయు, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐలు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపట్టాయని తెలిపారు. ఇప్పటికైనా మల్లయోధులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు బి.రామరాజు, మాజీ జిల్లా కన్వీనర్ జి.వి.రమణ, సిఐటియు సీనియర్ నాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, సీనియర్ న్యాయవాదుల నాయకులు బి.శంకరయ్య, ఎం.శ్రీనివాసమూర్తి, నాయకులు బాస్కారాచారి, జి.నగేష్ తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల అర్బన్ :** మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను కఠినంగా శిక్షించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. నంద్యాలలో ఎఐటియుసి ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు భూమని శ్రీనివాసులు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నారాయణమ్మ, సిపిఐ పట్టణ కార్యదర్శులు ప్రసాద్, డి. శ్రీనివాసులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

# 'ఆసరా' కొందరికే..

**- 70 శాతం మందికే నగదు జమ**
**- 45 రోజులైనా పడని డబ్బులు..**
**- వైఎస్ఆర్ ఆసరా లబ్ధిదారుల ఆందోళన**

**ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి**

**సంక్షేమ పథకాల కింద ప్రభుత్వం జమ చేసే సొమ్ములు లబ్ధిదారులకు ఎప్పటికి జమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. సిఎం బటన్ నొక్కి నెలలు గడిచిపోతున్నా ఇప్పటి వరకూ సగం మంది లబ్ధిదారులకు కూడా ఖాతాలకు సొమ్ము చేరలేదు. 45 రోజుల క్రితం బటన్ నొక్కి విడుదల చేసిన డ్వాక్రా సంఘాల ఆసరా సొమ్ము ఇప్పటికీ పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు చేరలేదు. దీంతో సంక్షేమ పథకాల లబ్ధిదారుల్లో ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది...**

2019 ఏప్రిల్ 11వ తేదీ వరకూ ఉన్న డ్వాక్రా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు వైసిపి హామీ ఇచ్చింది. డ్వాక్రా సంఘాలకు చేసే ఈ ఆర్థికసాయానికి 'ఆసరా' పథకంగా ప్రభుత్వం నామకరణం చేసింది. రెండు విడతల సొమ్ము జమ చేయగా మూడో విడత సొమ్ము మార్చి 25న ఏలూరు జిల్లా దెందులూరులో సిఎం బటన్ నొక్కి




విడుదల చేశారు. నంద్యాల జిల్లాలో 25,936 స్వయం సహాయక సంఘాల సభ్యులకు వైఎస్ఆర్ ఆసరా నగదు జమ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మూడో విడతగా రూ.166.96 కోట్లు జమ చేయాల్సి ఉంది. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 3044 స్వయం సహాయక పొదుపు సంఘాలకు రూ. 20.89 కోట్లు, బనగానపల్లిలో 4282 సంఘాలకు రూ.28.29 కోట్లు, డోన్‌లో 3029 సంఘాలకు రూ.17.81 కోట్లు, నందికొట్కూర్‌లో 4072 సంఘాలకు రూ.27.29 కోట్లు, నంద్యాలలో 2001 సంఘాలకు రూ.13.95 కోట్లు, పాణ్యంలో 1346 సంఘాలకు రూ. 63.94 కోట్లు, శ్రీశైలంలో 3277 సంఘాలకు రూ.21.45 కోట్లు జమ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. సిఎం బటన్ నొక్కిన తర్వాత ఎంఎల్ఎలు అంతా వారివారి నియోజకవర్గాల్లో మెగా చెక్కుల పంపిణీ చేసి హడవుడి చేశారు. ఆసరా సొమ్ము విడుదలకు సంబంధించి సిఎం బటన్ నొక్కి 45 రోజులు గడిచింది. ఇప్పటి వరకూ 70 శాతం గ్రూపులకు మాత్రమే ఆసరా సొమ్ము జమ అయింది. మిగిలిన గ్రూపులకు ఎప్పటికి జమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. డ్వాక్రా సంఘాల్లో 70 శాతం పైగా గ్రూపులకు నగదు జమైనట్లు తెలుస్తోంది. ఆసరా డబ్బు జమ కాకపోవడం డ్వాక్రా సభ్యుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇంకా డబ్బులు జమ కావడానికి 15 రోజులు పట్టొచ్చని అధికారులు చెబుతుండటంతో ఇదేం తీరంటూ డ్వాక్రా సంఘాల మహిళలు ప్రశ్నిస్తున్నారు.

**రైతు భరోసా, అమ్మఒడి పరిస్థితి ఏంటి..?**

ఖరీఫ్ ఆరంభంలో రైతు భరోసా, స్కూల్స్ ప్రారంభమయ్యే నాటికి అమ్మఒడి పథకాలకు సంబంధించిన సొమ్ము విడుదల చేయాల్సి ఉంది. బటన్ నొక్కిన పథకాలకు సంబంధించిన సొమ్ములే ఇంకా జమ కాలేదు. బటన్ నొక్కాల్సిన పథకాల సొమ్ము ఇక ఎప్పటికి జమవుతుందోనన్న చర్చ లబ్ధిదారుల్లో కొనసాగుతోంది.

# లోకేష్ రాజకీయాలకు పనికిరాడు

**- అసత్య ఆరోపణలు, దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి**
**- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

లోకేష్ జ్యోతిష్యం చెప్పడానికి పనికి వస్తాడే తప్ప రాజకీయాలకు పనికిరాడని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవి చంద్ర కిషోర్ రెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం ఎమ్మెల్యే శిల్పా రవి తన నివాసంలోని వైసిపి కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. తనపై చేసిన ఆరోపణలను లోకేష్ నంద్యాల నుండి వెళ్లేలోపు నిరూపించాలని సవాల్ విసిరారు. సంస్కారం, సభ్యత మరిచి మాట్లాడడం లోకేష్‌కు, టిడిపి నాయకులకు తగదన్నారు. లోకేష్ వ్యవహార శైలిని మార్చుకోవాలని, దిగజారుడు రాజకీయాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. నంద్యాల బహిరంగ సభలో లోకేష్ ప్రజల సమస్యల, రాయలసీమ ప్రాంత అభివృద్ధి, భవిష్యత్తులో చేపట్టనున్న అభివృద్ధి గురించి ప్రస్తావిస్తాడని ప్రజలు ఆశించారని, అయితే అతను కేవలం అధికార పార్టీపై, వైసిపి నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తూ బురదజల్లే కార్యక్రమాన్ని పెట్టుకున్నారన్నా రని కౌంటర్ ఇచ్చారు. లోకేష్ ఎదుటివారిని తిడుతూ ప్రవర్తిస్తున్న తీరు హాస్యస్పదంగా ఉందన్నారు. రాయ మాల్పురం స్మశాన వాటిక తమ సర్పంచి కబ్జా చేసినట్లు నిరూపించాలని ఛాలెంజ్ చేశారు. కుందూ మట్టిని దేవాలయాలకు, మసీదులకు, ప్రజా ప్రయోజనాలకి ఉపయోగించా మని స్పష్టం చేశారు. అబ్దుల్ సలాం కుటుంబానికి అండగా ఉన్నది వైసిపి మాత్రమేనన్నది నిజమన్నారు. ఈ విషయాన్ని కూడా రాజకీయం చేయడం టిడిపి వారికి తగదన్నారు. ఆర్టీవో ఏజెంట్ కరీం కుటుంబానికి వైసిపి ప్రభుత్వం అండగా నిలిచి ఆర్థిక సాయంగా రూ.9 లక్షలు ఇచ్చామన్నారు. బొగ్గులైన్ రహదారి వెడల్పులో తమ స్వలాభం ఎక్కడుందో లోకేష్ చూపాలన్నారు. నష్టాల్లో ఉన్న విజయ డైరీని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అతికొద్ది కాలంలోనే 33 కోట్ల రూపాయల ఆదాయం చేకూర్చిందన్నారు. హెరిటేజ్ డైరీ కోసం ప్రభుత్వ రంగ డైరీలను నష్టాల ఊబిలోకి నెడుతున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ముందు టిడిపిలో జరుగుతున్న పరిస్థితులను చక్కబెట్టుకోవాలని, ఎదుటి వారిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. నంద్యాల విడిచి వెళ్లే లోపు టిడిపి నాయకులు విజయ డైరీకి ఇవ్వాల్సిన ఒక కోటి 42 లక్షలు చెల్లించి వెళ్లాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఇస్సాక్ భాషా, రాష్ట్ర మార్క్ ఫెడ్ ఛైర్మన్ పిపి నాగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పామ్ షావలి, దృశ్య కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, ఎపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ డా. శశికళ రెడ్డి, రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, ఎంపిపి శెట్టి ప్రభాకర్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సిద్ధం శివరాం, సర్పంచి పూల శ్రీను, టివి రమణ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# 1300 మైలురాయి

**- నంద్యాలలో యువగళం**

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్/రూరల్**

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 103వ రోజు గురువారం నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉత్సాహంగా సాగింది. పాదయాత్ర 1300 కిలోమీటర్ల మైలురాయిని అధిగమించిన సందర్భంగా నంద్యాల యాతం ఫంక్షన్ హాలు సమీపాన లోకేష్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక నంద్యాల రూరల్ కానాలలో పసుపు మార్కెట్, కోల్డ్ స్టోరేజీ ఏర్పాటుకు యువనేత లోకేష్ హామీ ఇచ్చారు. 50 రోజులుగా కుడి భుజం నొప్పితో బాధపడుతున్నప్పటికీ యువనేత లోకేష్ మొక్కవోని పట్టుదలతో పాదయాత్ర కొనసాగిస్తున్నారు. ఉదయం డాక్టర్ల సూచనమేరకు నంద్యాల పద్మావతి నగర్‌లో ఉన్న మ్యాగ్న ఎంఆర్ఐ సెంటర్‌లో నారా లోకేష్ కుడి భుజానికి ఏంఆర్ఐ స్కానింగ్ చేయించారు. పాదయాత్ర ఉమ్మడి అనంతపురం జిల్లా కదిరి నియోజకవర్గంలోకి ప్రవేశించిన సందర్భంలో భారీగా తరలివచ్చిన ప్రజలు, కార్యకర్తల తోపులాటలో నారా లోకేష్ కుడి భుజానికి గాయమైంది. అప్పటి నుండి నొప్పితో బాధపడుతూనే లోకేష్ పాదయాత్ర కొనసాగిస్తున్నారు. ఫిజియోథెరపీ, డాక్టర్ల సూచన మేరకు జాగ్రతలు తీసుకున్నా నొప్పి తగ్గలేదు. 50 రోజులు దాటినా నొప్పి తగ్గకపోవడంతో డాక్టర్ల సూచన మేరకు ఎంఆర్ఐ స్కానింగ్ చేయించారు. ఇదిలా వుండగా గురువారం కానాలలో లోకేష్ పాదయాత్ర సందర్భంగా రోడ్లన్నీ జనంతో కిటకిటలాడాయి. యువనేతను చూసేందుకు భారీగా జనం రోడ్లపైకి తరలివచ్చారు. ముస్లిం మైనారిటీలు యువనేతకు స్వాగతం పలికి తమ సమస్యలను విన్నవించారు. రోడ్డుకి ఇరువైపులా ఉన్న యువత, మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, వేసవిలో విద్యుత్ కోతలతో ఇబ్బంది పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మరో ఏడాది ఓపిక పడితే రాబోయే చంద్రన్న ప్రభుత్వం అందరి సమస్యలు తీరుస్తుందని భరోసా ఇచ్చి లోకేష్ ముందుకు సాగారు. అంతకుముందు యాతం ఫంక్షన్ హాలువద్ద రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించిన లోకేష్ వారి సమస్యలు తెలుసుకున్నారు. దారి పొడవునా కుందూనది పరివాహక గ్రామాల ప్రజలు, జాతీయ రహదారి ఎలైన్ మెంట్ మార్పు బాధితులు, వడ్డెరలు, ముస్లింలు యువనేతను కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. మొత్తం 17.3 కిలోమీటర్ల మేర యువనేత పాదయాత్ర కొనసాగింది. ఇప్పటివరకు మొత్తం 1319.1 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తయింది. పాదయాత్రలో మాజీ మంత్రి ఫరూక్, టిడిపి నంద్యాల నియోజకవర్గ ఇన్చార్జి భూమా బ్రహ్మానంద రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.




1300 కిలోమీటర్ల మైలురాయి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నారా లోకేష్



నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు



లోకేష్ వెంట పాదయాత్రలో మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

## లోకేష్ పాదయాత్రలో బిసి జనార్దర్ రెడ్డి

**ప్రజాశక్తి - బనగానపల్లె :** నంద్యాల నియోజకవర్గంలోని యాతం జయచంద్రారెడ్డి ఫంక్షన్ హాల్ శివారు విడిది కేంద్రం నుంచి ప్రారంభమైన యువగళం పాదయాత్రలో యువ నాయకుడు నారా లోకేష్‌కు సంఘీభావం తెలుపుతూ బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు. నారా లోకేష్ వెంట ఆయన పాదయాత్రలో నడిచారు.

## కిడ్నాప్ గురైన బాలికలు తల్లిదండ్రులకు అప్పగింత

**- కిడ్నాపర్ అరెస్టు : సిఐ**

**ప్రజాశక్తి - కోవెలకుంట్ల :** ఈ నెల 16న కిడ్నాప్‌కు గురైన ఇద్దరు మైనర్ బాలికలను విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో రక్షించి, కిడ్నాపర్‌ను అరెస్టు చేసినట్లు కోవెలకుంట్ల సిఐ నారాయణ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి సిఐ మాట్లాడారు. ఈ నెల 16వ తేదీ 10 గంటలకు తల్లి షర్మిల మైనర్ బాలికలు షర్మిల(13), ఆసియా (7) ఇద్దరూ కనపడడం లేదని, ఆటో డ్రైవర్ షేక్ ఇమామ్ హుస్సేన్ కిడ్నాప్ చేసినట్లు ఫిర్యాదు చేసిందన్నారు. ఎస్సై వెంకట్ రెడ్డి తన బృందంతో విశాఖ రైల్వే పోలీసుల సహకారంతో కిడ్నాప్‌కు గురైన ఇద్దరు మైనర్ బాలికలను రక్షించి, కిడ్నాపర్ ఆటో డ్రైవర్‌ను విశాఖపట్నం రైల్వే స్టేషన్లో అదుపులోకి తీసుకొని కోయిలకుంట్లకు తీసుకువచ్చారని చెప్పారు. మైనర్ బాలికలను తల్లిదండ్రులకు అప్పజెప్పి, కిడ్నాపర్‌ను అరెస్ట్ చేశామని తెలిపారు. ఆడపిల్లలు పాఠశాలలకు, కళాశాలలకు ప్రత్యేక ప్రదేశాలకు వెళ్లేటప్పుడు పూర్తిస్థాయిలో తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు. ముఖ్యంగా 11 నుంచి 14 సంవత్సరాల లోపు ఆడపిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఆటో డ్రైవర్లు, బస్సు డ్రైవర్లు, దగ్గరగా ఉన్న వ్యక్తులతో జాగ్రత్త వహించాలన్నారు. కిడ్నాప్ కేసును 24 గంటల్లో చేధించిన ఎస్ఐ వెంకట్ రెడ్డి బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మౌలాని, పోలీసులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ నారాయణ రెడ్డి

# సర్వే రాళ్ల లక్ష్యాన్ని పూర్తి చేయండి

**- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి**

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకంలో భాగంగా రీ సర్వే పూర్తయిన ప్రాంతాల్లో సర్వే రాళ్ళు పాతే ప్రక్రియను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. గురువారం వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి స్పందన అర్జీల పరిష్కారం, భూముల రీ సర్వే, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, నాడు-నేడు, జగనన్న విద్యా కానుక కిట్లు తదితర అంశాలపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్‌తో పాటు జెసి నిశాంతి.టి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవహర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారుల భూసేకరణ, గృహ నిర్మాణాల స్టేజి కన్వర్షన్ ఉండేలా వేగవంతం చేయాలని, స్పందన గ్రీవెన్స్‌లను నాణ్యతతో పరిష్కరించాలని సూచించారు. పర్యాటక శాఖకు చెందిన భూసేకరణ త్వరితగతిన చేయాలన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖలు రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం కింద స్వీకరించిన దరఖాస్తులకు సర్వీసుల డెలివరీ పక్కాగా నిర్వహించాలని పంచాయతీరాజ్, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించారు. సూక్ష్మ సేద్య అమలు పథకం కింద డ్రిప్, స్ప్రింక్లర్స్ సరఫరాకు రైతులను గుర్తించి రిజిస్ట్రేషన్లు చేయించాలని ఏపీఎంఐపి పిడిను ఆదేశించారు. యంత్ర సేవా పథకం కింద 21 గ్రూపులకు రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకర్లతో సంప్రదించాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. పండ్ల తోటల అభివృద్ధిలో జిల్లా దిగువ నుండి 5వ స్థానంలో ఉందని, పండ్ల తోటల అభివృద్ధికి లబ్ధిదారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారిని ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జెసి,

## పెరుగనున్న ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు

**- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్**

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

జిల్లాలో రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని, వడగాల్పులు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్ ప్రజలకు సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో 41 నుంచి 44 డిగ్రీల వరకు ఎండలు భగ్గుమనడంతోపాటు వడగాడ్పులు కూడా వీస్తాయని వాతావరణ నిపుణులు తెలిపారని, ఈ మేరకు భారత మెట్రోలాజికల్ విభాగం (ఐఎండీ), వాతావరణ శాఖ కూడా హెచ్చరికలు జారీ చేశారని తెలిపారు. రోహిణి కార్తె సమీపించినందున ఎండలు పెరుగుతాయని, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు, పిల్లలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేడి వల్ల డీహైడ్రేషన్ బారినపడే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. కాబట్టి ప్రజలు నీళ్ళ, మజ్జిగ, కొబ్బరి నీరు లాంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తల, మొహంపై నేరుగా సూర్య కిరణాలు పడకుండా టోపీ లేదా తలపాగా ధరించాలని, లేదా గొడుగు వాడాలని పేర్కొన్నారు.

# అధికార పార్టీ కుట్రతోనే తప్పుడు కేసులు

**- కేసులకు భయపడేదే లేదు**
**- ఆళ్లగడ్డలో యువగళం విజయవంతం చేస్తాం**
**- టిడిపి నాయకులు భూమా జగత్ విఖ్యాత్**

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

మాజీ మంత్రి, తన సోదరి భూమా అఖిలప్రియపై తప్పుడు కేసులు పెట్టడంలో అధికార వైసిపి కుట్ర ఉందని టిడిపి తాలూకా యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ఆరోపించారు. గురువారం పట్టణంలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. గత 40 రోజులుగా పాదయాత్రలో భూమా అఖిల ప్రియ చంటి బిడ్డను వదిలి లోకేష్ వెంట నడుస్తున్నారని, ఇన్ని రోజులుగా జరగని గొడవ ఆళ్లగడ్డ పర్యటన మరో మూడు రోజుల సమయం ఉండగా జరగడం అనుమానాలకు తావిస్తుందన్నారు. అక్క అఖిలప్రియ ఇమేజ్‌ను డ్యామేజ్ చేయాలన్న దురుద్దేశంతో పక్కా ప్రణాళికతో వ్యూహం పన్ని




మాట్లాడుతున్న భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

గొడవలు సృష్టించారన్నారు. జరిగిన సంఘటన అందరికీ తెలిసిందేనన్నారు. తన అక్కపై తప్పుడు కేసులు నమోదు చేసి చంటిపిల్ల తల్లి అని కూడా చూడకుండా జైలుకు పంపించారన్నారు. ఏవి సుబ్బారెడ్డి అక్క చున్ని పట్టుకొని అవమానకరంగా ప్రవర్తించారన్నారు. అలా చేసినందుకే కార్యకర్తలు దాడికి దిగారన్నారు. వెంటనే అక్క స్పందించి కార్యకర్తలకు సర్ది చెప్పారన్నారు. కూతురు లాంటి అఖిలప్రియ పట్ల ఏవి సుబ్బారెడ్డి అభ్యంతరకరంగా వ్యవహరించారన్నారు. ఈ గొడవ టిడిపి నేతల మధ్య జరిగింది కాదని ఇందులో కచ్చితంగా అధికార పార్టీ వారి ప్రమేయం ఉందన్నారు. ఆళ్లగడ్డలో పాదయాత్రను దెబ్బ తీసేందుకు వారు కుట్ర పన్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా ఆళ్లగడ్డలో పాదయాత్రను విజయవంతం చేస్తామన్నారు. కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. అక్క అఖిల ప్రియ ఏవి సుబ్బారెడ్డిపై కేసు పెట్టారని, ఆ కేసు ఏమైందని ప్రశ్నించారు. నంద్యాల ఘటనలో బాధితులమైన తమపైనే కేసులు నమోదు చేసి జైలుకు పంపించడం అన్యాయమన్నారు. ఈ పాదయాత్రతో భూమా అఖిలప్రియ బలం ఏమిటో రాష్ట్రం అంతటా తెలుస్తుందన్నారు. నంద్యాల ఘటనపై విచారణ చేయనున్న టిడిపి క్రమశిక్షణ కమిటీ బాధితురాలైన తన అక్కకు న్యాయం చేస్తుందన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఈనెల 21 నుండి యువగళం పాదయాత్ర మొదలవుతుందన్నారు. ఈ యాత్రను టిడిపి నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

## అవుకు రిజర్వాయర్ బోటు కాంట్రాక్టర్, డ్రైవర్ అరెస్టు

**ప్రజాశక్తి బనగానపల్లె**

అవుకు రిజర్వాయర్‌లో నిబంధనలకు విరుద్ధంగా, నిర్లక్ష్యంగా బోటును నడిపి ముగ్గురి మృతికి కారకులైన బోటు కాంట్రాక్టర్ శ్రీనివాస నాయుడు, బోటు డ్రైవర్ శ్రీనివాసరావులను అరెస్టు చేసినట్లు డోన్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితులను హాజరు పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న అవుకు రిజర్వాయర్‌లో నిబంధనలకు విరుద్ధంగా బోటును నడిపి కోవెలకుంట్ల పోలీస్ స్టేషన్ ఎస్బి కానిస్టేబుల్ దూదేకుల రసూల్ కుటుంబ సభ్యులైన దూదేకుల ఆసియా భాను, దూదేకుల నూర్జాహన్, దూదేకుల సాజిదా మృతికి కారణమైన కాంట్రాక్టర్ శ్రీనివాస నాయుడు, బోటు డ్రైవర్ శ్రీనివాసరావులను అవుకు ఎస్సై జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అరెస్టు చేసినట్లు తెలిపారు. 2018లో తాడిపత్రికి చెందిన కాంట్రాక్టర్ శ్రీనివాస నాయుడు రెస్టారెంట్ రిజర్వాయరులో బోటు నడిపేందుకు ఎపి టూరిజం శాఖ ద్వారా కాంట్రాక్ట్ తీసుకున్నట్లు చెప్పారు. ఈ కాంట్రాక్టు 2023 సెప్టెంబర్ 24 వరకు ఉన్నట్లు తెలిపారు. బోటును నడిపేందుకు బోటు సేఫ్టీ సంబంధించి కాకినాడ పోర్టు ద్వారా అనుమతులు తీసుకోవాల్సి ఉందన్నారు. 2021 వరకు కాకినాడ పోర్టు ద్వారా బోటు నడిపేందుకు కాంట్రాక్టర్ శ్రీనివాస నాయుడు అనుమతులు తీసుకున్నాడని చెప్పారు. ఆ తర్వాత బోటు నడిపేందుకు రెన్యువల్ చేసుకోలేదన్నారు. ఈ నెల 14న ఎస్బి కానిస్టేబుల్ రసూల్ కుటుంబం 12 మంది అవుకు రిజర్వాయరులో బోటు విహారయాత్ర కోసం బయలుదేరారని, బోటు డ్రైవర్ పాటు అసిస్టెంట్ లేకుండా ఒక్కరే లోపలికి తీసుకెళ్లారని, బోటులో ఉన్నవారికి లైఫ్ జాకెట్లు కూడా ఇవ్వలేదన్నారు. బోటులోకి నీళ్ల రావడంతో డ్రైవర్ ప్రయాణికులను రక్షించకుండా బోటు నుండి దూకి పారిపోవడంతో బోటు బోల్తా పడి ఆసియా భాను, నూర్జాహన్, సాజిదా మృతి చెందారని తెలిపారు. కాంట్రాక్టర్ శ్రీనివాస నాయుడు బోటుకు రెన్యువల్ తీసుకపోవడం, బోటు డ్రైవర్ శ్రీనివాసరావు నిర్లక్ష్యంగా నడిపి ముగ్గురి మృతికి కారణం కావడంతో వీరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇన్చార్జి సిఐ ప్రియతం రెడ్డి, అవుకు ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.



# ఎంపి బ్రిజ్ భూషణ్‌ను బర్తరఫ్ చేయాలి

### - ప్రజా సంఘాలు డిమాండ్



నిరసన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

**ప్రజాశక్తి - నందికొట్కూరు**

రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేసిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే పార్టీ నుండి బర్తరఫ్ చేసి, చట్టం ప్రకారం శిక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం నాగేశ్వరావు డిమాండ్ చేశారు. గురువారం నందికొట్కూరులో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, ఎస్ఎఫ్ఐ, మహిళా సంఘం ఆధ్వర్యంలో నందికొ ట్కూరు కొత్త బస్టాండ్ నందు ఎంపీ బ్రిజ్ భూషణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ఎం నాగేశ్వరావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి వెంకటేశ్వర్లు, బేస్తరాజు వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి పీపక్కిరి సాహెబ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కుమార్, సిఐటియు జిల్లా నాయకులు గోపాలకృష్ణ, నాగన్న, ఆర్ జయరా నీ, సుమన్, బాష, మహిళా సంఘం సోడా బిబి, వ్యకాసం నాయకులు వెంకటే శ్వర్లు, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు, ముస్లింలకు, దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. దేశానికి స్వర్ణ పథకాలు సాధిస్తున్న క్రీడ క్రీడాకారుల మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీపై కేసు నమోదు చేయాలని ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర రెజ్లర్లు నెల రోజుల నుండి ఆందోళన చేస్తున్న కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని అన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రెజ్లర్లు, మహిళలపై పోలీసులు దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌పై చట్ట ప్రకారం కేసు నమోదు చేసి జైల్లో పెట్టాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

**ఆత్మకూర్:** రేజర్లపై లైంగికంగా దాడికి పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి. యేసు రత్నం, మాజీ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఏ రణధీర్, మహిళా సంఘం నాయకురాలు మీనాక్షమ్మలు డిమాండ్ చేశారు. రేజర్లపై లైంగిక దాడికి వ్యతిరేకంగా స్థానిక గాంధీ విగ్రహం ముందర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు నరసింహ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎన్. స్వాములు, సి ఐ టి యు పట్టణ అధ్యక్షులు ఎం. రజాక్, కార్యదర్శి డి. రామ్ నాయక్, వత్తి దారుల సంఘం నాయకులు సి. వెంకటేశ్వర్లు, నాయకులు నూర్, రఫిక్, హుసేన్, తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద కొవ్వతులతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు



మాట్లాడుతున్న టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కరీముల్లా

## స్వప్రయోజనాల కోసమే మాజీ ఎమ్మెల్యే బుడ్డాపై ముస్తీ నూర్ ఆరోపణలు

**ప్రజాశక్తి - ఆత్మకూర్**

ముస్తీ నూర్ మహమ్మద్ స్వప్రయోజనాల కోసం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నంద్యాల తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సి.కరీముల్లా, తదితరులు మీడియాతో మాట్లాడారు. శిల్పా చక్రపాణి రెడ్డి దగ్గర మెప్పు కోసం బుడ్డా రాజశేఖర్ రెడ్డి పై పేరు తీసుకురావడానికే చేసిన వరకతే మసీద్ కొట్టాలని అని ఆరోపించారు. పార్టీలో ఉన్న ముస్లింలందరూ నారా చంద్రబాబు నాయుడు దగ్గరకు వెళ్లి మిమ్మల్ని బహిష్కరించే వరకు వదిలి పెట్టం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు అబ్దుల్లాపురం బాషా, వక్ఫ్‌దిన్, అలీ హుస్సేన్, శాబుద్దీన్, నాగూర్ ఖాన్, న్యాయతుల్లా, ఫజిల్ మున్నా, ఖాజా, గౌస్, జిలానీ, హాశం, అహ్మతుల్లా, నూర్ అహమ్మద్, నబీ, మున్నా, హబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు జడ్జిలు

## భావితరాలకు స్వచ్ఛంగా అందిద్దాం

**ప్రజాశక్తి - కొత్తపల్లి**

ప్లాస్టిక్ వాడకంను తగ్గించి భావితరాలకు స్వచ్ఛమైన పరిసరాలను అందించడానికి ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఫారెస్ట్ రేంజ్ అధికారి పట్టాభి, ఆత్మకూరు సబ్ డిఎఫ్ఓ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో డిఎస్‌ఓ ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో సర్పంచ్ మశమ్మ ఆధ్వర్యంలో పర్యావరణహిత జీవనశైలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణం దెబ్బతిని ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరు కలిసికట్టుగా ప్లాస్టిక్ వాడకం ఇప్పటి నుంచే తగ్గించి ఇతరులకు చెప్పాలన్నారు. గ్రామాలను పచ్చదనంగా పెంచేందుకు ముందుకు రావాలి అన్నారు. పర్యావరణం బాగుంటేనే మానవాళి జీవనశైలి బాగుంటుంది అన్నారు. అనంతరం ప్లాస్టిక్ వాడకం వద్దు పేపర్ వస్తువులు ముద్దు అని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ గురువయ్య, ఎఫ్‌బిఓ లక్ష్మీదేవి, సుధాకర్ రెడ్డి, ఎంపిటిసి ప్రమీల, మండల వైసిపి కన్వీనర్ సుధాకర్ రెడ్డి, రవీంద్రారెడ్డి, నారాయణరెడ్డి, రామిరెడ్డి, చంద్రమౌళి, గ్రామస్తులు ఉన్నారు.



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే

## వైసిపి నాయకుడి మృతికి సంతాపం

**ప్రజాశక్తి - చాగలమర్రి**

చాగలమర్రి పట్టణం శివాలయం వీధికి చెందిన వైసిపి నాయకుడు కొత్తపల్లె రసూల్ సాహెబ్ (67) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చాగలమర్రి చేరుకొని నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి బాబులాల్,గేట్లమాబు,మండల కోఆప్షన్ సభ్యుడు జిగ్గి గౌరి ఇబ్రహీం,భాస్కర్ బాషా,అబ్దుల్లా,తదితరులు పాల్గొన్నారు.



మంటలు ఆర్పుతున్న పోలీసులు, సర్పంచ్

## విద్యుద్ఘాతానికి పశుగ్రాసం దగ్ధం

**ప్రజాశక్తి - పగిడ్యాల**

ట్రాక్టర్‌పై పశుగ్రాసాని తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధమైన సంఘటన మండలంలోని పాలమర్రి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పాలమర్రి గ్రామానికి చెందిన మల్లయ్య అనే రైతు కేసీ ఆయకట్టు కింద తన పొలంలో ఉన్న వరిగడ్డిని అదే గ్రామానికి చెందిన మార్కుండేయులు అనే వ్యక్తి కొని ట్రాక్టర్లో వరిగడ్డిని తరలిస్తుండగా పాలమర్రి బొట్ పోలీస్ స్టేషన్ సమీపాన విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. ట్రాక్టర్ డ్రైవర్ తక్షణమే గ్రామ శివారులో విద్యుత్ సబ్ స్టేషన్ సమీపానికి తీసుకొచ్చి రోడ్డుపై వదిలారు. దీంతో రహదారిపై ట్రాఫిక్ నిలబడి ఆయిపోయింది. విషయం తెలుసుకున్న పగిడ్యాల సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న, పోలీసుల సహకారంతో ట్రాక్టర్లో నీళ్ల ట్యాంక్ ద్వారా మంటలార్పి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

## నదిలో బోట్లు నడిపితే చర్యలు : సిఐ

**ప్రజాశక్తి - కొత్తపల్లి**

నదిలో బోట్లు నడిపితే కఠిన చర్యలు తప్పవని నిబంధనలో అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆత్మకూరు సిఐ సుబ్బ హృణ్యం తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని సిద్దేశ్వరం జానాల గూడెం బలపాల తిప్ప సంగమేశ్వరం బోట్ నిర్వాహకులతో సంగమేశ్వరం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల మధ్య ఉన్న కృష్ణా నదిలో బోట్ తిప్పకూడదన్న ఆదేశాలు ఉన్నాయని హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించి కృష్ణా నదిలో బోట్ నిర్వాహకులు కొంతమంది ఇంజన్ బోట్లు పుట్టీలు తిప్పుతున్నారని ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చేదాకా ఇంజన్ బోట్లు, పుట్టీలు తిప్పరాదని హెచ్చరికలు జారీ చేశారు. నిబంధన అతిక్రమించి బోట్లు తిప్పిన 5 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సీఐ వెంట ఎస్ఐలు వెంకటేశ్వర్లు, అహమ్మద్ బాషా, హెడ్‌కానిస్టేబుల్ ఓబులేసు, కానిస్టేబుల్ ప్రసాద్ నాయక్, వెంకటేష్, బోట్ నిర్వాహకులు ఉన్నారు.



బోట్ నిర్వాహకులతో మాట్లాడుతున్న సిఐ

# పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - బండి ఆత్మకూర్**

రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. గురువారం బండి ఆత్మకూరు గ్రామంలో రెండవ రోజు గడపగడపకు ప్రభుత్వం అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికి వెళ్లి పథకాలను వివరించారు. ప్రతి కుటుంబం పొందిన లబ్ధిని గురించి వివరించారు. పథకాలు ఇలానే కొనసాగాలంటే మళ్ళీ వైసిపి ప్రభుత్వం రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సిడిపిఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు దే రెడ్డిచిన్న సంజీవా రెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, సర్పంచ్ ఎరుకల సంధ్య, మాజీ సర్పంచ్ రాజ్యం రెడ్డి సుజాతమ్మ, వైస్ ఎంపీపీ ముంతల మధురాని, జెసిఎస్ కన్వీనర్ ముడి మేళ పుల్లారెడ్డి, ఉపసర్పంచ్ అవతల నాగేశ్వర్ రెడ్డి, యువ నాయకులు పార్నపల్లి దిలీప్ రెడ్డి, దీప్ రెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మన్ ఇటిక్యాల చిన్న సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గడపగడపలో ఎమ్మెల్యే ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

**బేతంచెర్ల:** రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు వర్తింప చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని బేతంచెర్ల మండలం ఎంపీపీ బుగ్గల నాగభూషణం రెడ్డి అన్నారు. గురువారం నాడు బేతంచెర్ల మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గ్రామ సర్పంచ్ చిట్టే వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగభూషణం రెడ్డి, సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ బేతంచెర్ల మండల కేంద్రాన్ని మంత్రి బుగ్గన చొరవతో ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు మురళి కృష్ణ, తిరుమలేశ్వర్ రెడ్డి, గూని నాగరాజు, సింగిల్ విండో అధ్యక్షుడు రుద్రవరం నారాయణ, ఎద్దులన్న, వెంకటేశ్వర్లు, రామానాయుడు సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నిరుపేదలకు క్వాటర్స్ ఉచితంగా ఇవ్వాలి : ఐఎఫ్‌టియు

**ప్రజాశక్తి - శ్రీశైలం**

ఇరిగేషన్ క్వార్టర్స్‌లో నివాసానికి నిరుపేదలకు ఉచితంగా ఇవ్వాలని ఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వై ఆశీర్వాదం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుండి పెంట గ్రామాన్ని గ్రామపంచాయతీ చేసి పేద ప్రజలపైభారీగా ఆర్థిక భారాన్ని మోపుతుందన్నారు. నిరుపేదలు శ్రీశైల దేవస్థానంపై ఆధారపడి జీవిస్తున్నారని గతి లేని పరిస్థితిలో ఇరిగేషన్ క్వార్టర్స్‌లో జీవిస్తున్నారని, ప్రభుత్వం పంచాయతీ పేరు మీద భారీగా ఆర్థిక భారాన్ని మోపేందుకు సన్నాహాలు చేయడం దారుణం అన్నారు. గ్రామపంచాయతీ అధికారులు. ఇరిగేషన్ అధికారులు క్వార్టర్స్‌ను ఖాళీ చేయించడానికి సన్నాహాలు చేస్తున్నారని, డ్యాం నిర్మాణం కోసం సర్వస్వం కోల్పోయి వారిపై ప్రభుత్వం ఆర్థిక భారాన్ని మోపుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ఇక్కడున్న ఆర్థిక స్థితిగతులను గమనించి పేద ప్రజలకుభారం పడకుండాచూడాలని, లేనిచో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మండల అధ్యక్షుడు వై శీను, పి మల్లికార్జున, అధ్యక్షులు ఏ బెనహర్, ఎస్‌కే వలి, కొమరం భీమ్, చెంచు గిరిజన సంక్షేమ సంఘం నాయకులు భూమని జండాలమ్మ, కుడుముల వెంకటేశ్వర్లు, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకుడు జ్ఞాని ఆకాష్, తేజ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఐఎఫ్‌టియు నాయకులు

# దళితులకు 27 సంక్షేమ పథకాలు కొనసాగించాలి : కెవిపిఎస్

**ప్రజాశక్తి - ఆత్మకూర్**

రాష్ట్ర ప్రభుత్వం దళితులకు వర్తించే 27 సంక్షేమ పథకాలు కొనసాగించాలని కెవిపిఎస్ జిల్లా పరిధాన కార్యదర్శి కొప్పుల రామదాసు, జిల్లా ఉపాధ్యక్షులు వి. యేసు రత్నంలు అన్నారు. గురువారం స్థానిక డాక్టర్ ఏ.ధనుంజయ మీటింగ్ హాల్ నందు కెవిపిఎస్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షురాలు కే రంగమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులం వివక్ష వ్యతిరేక పోరాట సంఘం పోరాట ఫలితంగా దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ఆర్థికంగా సామాజికంగా జీవించడానికి ఉపయోగపడిందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నవరత్నాల పేరుతో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే 27 సంక్షేమ పథకాలు రద్దు చేసిందన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దళితులు గిరిజనులు అభివద్ధికి ఉపయోగించకుండా ఇతర కులాలకు ఇచ్చే సంక్షేమ పథకాలకు వాడుకున్నారన్నారు. డప్పు కళాకారులకు రూ.5000 పెన్షన్ ఇచ్చి ఐదు లక్షలు జీవిత బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ వయస్సు 45 సంవత్సరాల తగ్గించాలన్నారు. డప్పు కళాకారులను భజంత్రీల మాదిరిగా ప్రతి దేవాలయంలో డప్పు కళాకారులను సంగీత కళాకారులుగా ఉపయోగించుకొని వారికి జీతాలు ఇవ్వాలని, స్మశాన వాటికల్లో గుంతలు తీసే బేదరీలకు ఐడెంటి కార్డులు ఇచ్చి ఐదు వేల రూపాయలు పెన్షన్ ఇచ్చి, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. స్మశానంలో గుంతలు తీయడానికి పనిముట్లు ప్రభుత్వం ఇవ్వాలని, ప్రతి గ్రామంలో దళితులకు కె.వి.ఆర్.పి.ఎస్ పోరాట ఫలితంగా వచ్చిన స్మచారాల జీవో 1235 ప్రకారం ప్రతి దళితపేటకు రెండు ఎకరాల పొలం కొని ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు ఉసెనమ్మ, మారెన్న, పాతకోట భాస్కర్, సుంకన్న, లింగన్న, సురేష్,బ జారు, రమేష్ ,జయరాజు తదితరులు పాల్గొన్నారు.



అమరవీరులకు నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ జిల్లా కమిటీ నాయకులు

# నూతన జాతీయ విద్యావిధానం రాజ్యాంగ వ్యతిరేకం : టిడిఎఫ్

**ప్రజాశక్తి - నందికొట్కూరు**

నూతన జాతీయ విద్యావిధానం రాజ్యాంగ వ్యతిరేకం అని డిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం ఏసేపు పేర్కొన్నారు. గురువారం నందికొట్కూరులోని సిఎస్ఐ ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షులు ఎంఎస్ కె కిషోర్ అధ్యక్షతన డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నంద్యాల జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం ఏసేపు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రత్నం ఏసేపు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయులపై, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాయని, జాతీయ విద్యా విధానం,- 2020 పేరిట విద్యారంగంలో ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారు. ఫలితంగా భారత విద్యారంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, పెరిగిపోతున్నాయనీ ఆవేధన వ్యక్తం చేశారు. డిటిఫ్ విద్యారంగంలో విలువల కొరకు పనిచేస్తూ వుందన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లాకు సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన జిల్లా శాఖ అధ్యక్షుడుగా ఎంఎస్‌కె కిషోర్, ఉపాధ్యక్షులుగా జి. రోషన్న, కే. సరోజినీ దేవి, ప్రధాన కార్యదర్శిగా ఎస్. ఆంజనేయులు, కార్యదర్శులుగా ఎస్ స్వామిశేఖర్, కే. రాఘవేంద్ర రావు, మధు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా రత్నం ఏసేపు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.




మాట్లాడుతున్న డిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం ఏసేపు



మాట్లాడుతున్న ఆవాజ్ కమిటి పట్టణ అధ్యక్షుడు అబ్దుల్లా

## 23న ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వడుగులు

**ప్రజాశక్తి - నందికొట్కూరు**

ఈనెల 23వ తేదీన ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వడుగుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆవాజ్ కమిటి పట్టణ అధ్యక్షుడు అబ్దుల్లా తెలిపారు. పట్టణంలోని ఆవాజ్ కమిటీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్లా మాట్లాడుతూ స్థానిక ముబారక్ ఫంక్షన్ హాల్ నందు ఉదయం 7:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఉచిత వడుగుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరము కూడా ఉచిత ఒడుగులు మందుల పంపిణీ, మంచి నైపుణ్యం ఉన్న డాక్టరు చేత వడుగులు చేపిస్తున్నట్టు వారు తెలిపారు. ముందుగానే సంబంధిత పట్టణ,గ్రామ ఆవాజ్ కమిటీ నాయకులకు తమ పిల్లల పేర్లను నమోదు చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ ఉపాధ్యక్షులు సయ్యద్ మహమ్మద్ రఫీ,కోశాధికారి మహబూబ్ బాషా,మారుతీ నగర్ రఫీ,కార్యదర్శి అజ్మత్ ఆవాజ్ కమిటీ నాయకులు కే.బాష్,నాసిర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుగంగ కాలువ మరమ్మతుకు నిధులు మంజూరు

**ప్రజాశక్తి - చాగలమర్రి**

తెలుగు గంగ ప్రధాన కాలువ, పంట కాలువల మరమ్మతులకు రూ.18 కోట్లు నిధులు మంజూరయ్యాయని ఈఈ శివశంకర్ రెడ్డి తెలియజేశారు. చాగలమర్రి మండలంలోని చింతలచెరువు పరిసర ప్రాంతాల్లో ప్రారంభమైన పంట కాలువ మరమ్మతుల పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు గంగ ప్రధాన కాలువ, 36వ బ్లాకు నుంచి పంట కాలువల మరమ్మతులకు రూ.18కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రధాన కాలువలో దెబ్బతిన్న చోట్ల లైనింగ్ పనులను చేపడుతున్నామన్నారు. పంట కాలువల్లో పూడికతీత, దెబ్బతిన్న స్ట్రక్చర్ల మరమ్మతులు చేపడుతున్నా మన్నారు. చివరి ఆయకట్టుకు నీరు అందివ్వడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ గోవిందరాజులు, ఏఈలు నియాజ్ అహ్మద్, సలీం పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంట దగ్ధం

### - రూ. 6 లక్షలు నష్టం

**ప్రజాశక్తి - అవుకు**

మండలంలోని సంగపట్నం గ్రామ రైతు బత్తుల చిన్న ఈశ్వర్ రెడ్డికి చెందిన చేతికి వచ్చిన మొక్కజొన్న పంట ప్రమాదవశాత్తు గురువారం పూర్తిగా దగ్ధమైంది. బాధిత రైతు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. రైతు చిన్న ఈశ్వర్ రెడ్డి పది ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. మరో రెండు రోజుల్లో మిషన్ సహాయంతో నూర్పిడి చేసేందుకు సిద్ధంగా ఉన్న పంట ప్రమాదవశాత్తు పూర్తిగా దగ్ధం కావడంవతో రైతు దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. దాదాపు రూ.6 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న బనగానపల్లె అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయింది.



దగ్ధమవుతున్న మొక్కజొన్న పంట



జెసిబిని విరాళంగా ఇస్తున్న ఎస్‌బిఐ అధికారులు

## శ్రీశైల దేవస్థానానికి ఎస్‌బిఐ జెసిబి విరాళం

**ప్రజాశక్తి - శ్రీశైలం**

ఎస్‌బిఐ శ్రీశైలం దేవస్థానానికి జెసిబి వాహనాన్ని విరాళంగా గురువారం అందజేసింది. దీని విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని ఎస్‌బిఐ అధికారులు తెలిపారు.



ఎమ్మెల్యే గంగులకువినతిపత్రం అందజేస్తున్న జెఎసి నేతలు

## ఉద్యోగుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లండి

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

ఉద్యోగస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని జేఏసీ ఉద్యోగులు ఎమ్మెల్యే గంగులకు వినతిపత్రం అందించారు. ఏపీ జేఏసీ అమరావతి మూడవ దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఉద్యోగుల ఆవేదనను చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల నానిని గురువారం ఏపీ జెఏసి నంద్యాల జిల్లా నాయకులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రతి నెల 1న ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్, పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏ అరియర్స్, పిఆర్సి అరియర్స్, 11వ పిఆర్సి కమిషన్ రెకమండు చేసిన పే స్కేల్ విడుదల, పెండింగ్‌లో ఉన్న రెండు డీఏల చెల్లింపు, పాదయాత్రలో ముఖ్యమంత్రి ప్రకటించిన సిపిఎస్ రద్దు, ఓపిఎస్ పునరుద్ధరణ గురించి తదితర ప్రధాన సమస్యలను గురించి జేఏసీ నంద్యాల జిల్లా నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ఏపీ జెఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా చైర్మన్ రామచంద్రరావు, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షులు కామేశ్వర్ రెడ్డి, కోశాధికారి నాగరాజు, నంద్యాల డివిజన్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు విజయ శేఖర్, ఆళ్లగడ్డ డిడిలు రవీంద్రప్రసాద్, చంద్రశేఖరయ్య లు పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్ రోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

## బిటి రోడ్డు నిర్మాణానికి సహకరించాలి

**ప్రజాశక్తి-డోన్**

డోన్ పట్టణంలోని పాత బస్టాండ్ నుండి రైల్వే స్టేషన్ వరకు రూ.2 కోట్ల80 లక్షలతో నిర్మిస్తున్న 60 అడుగుల బిటీ రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేస్తున్నందున ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలి డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 19వ తేదీ నుంచి నుంచి 21వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ రోడ్డును మూసి వేయడం జరుగుతుందని, పట్టణ ప్రజలు రైల్వే స్టేషన్‌కి వెళ్లేటు వంటి వారు కోర్టు పక్కన దారిని ఉపయోగించుకోవాలని తెలియజేశారు.



## ప్లాస్టిక్ వద్దు.. పేపర్ ముద్దు : డిఆర్ఒ

**ప్రజాశక్తి - మహానంది**

ప్రస్తుత పరిస్థితుల్లో ప్లాస్టిక్ వాడకం తగ్గించి భావితరాలకు స్వచ్ఛమైన పరిసరాలను అందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని డిఆర్ఒ సుబ్బయ్య తెలిపారు. గురువారం మండలంలోని ఎం.సి.ఫారం గ్రామంలో వున్న వ్యవసాయ కళాశాల ఆవరణంలో కళాశాల అధ్యాపకుల బృందం, అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో పర్యావరణహిత జీవనశైలి కార్యక్రమం విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ గ్రామాలను కూడా పచ్చదనంగా పెంచేందుకు ముందుకు రావాలన్నారు. అనంతరం కళాశాల అవరణలో ప్లాస్టిక్, చెత్తను ఏరివేశారు. కార్యక్రమంలో ఎఫ్‌బిఒ ప్రతాప్, వ్యవసాయ కళాశాల అధ్యాపకుల బృందం, విద్యార్థులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు

**ప్రజాశక్తి - రుద్రవరం**

మండలంలోని బి.నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నలుగురిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శోభన్ బాబు గురువారం తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ అదే గ్రామంలోని గుర్రప్ప మాన్ దగ్గర ఉంటున్న సుధాకర్‌ని కులం పేరుతో దూషించారని బాధితుడు ఫిర్యాదు చేయడంతో లక్ష్మీనారాయణ, గురు మోహన్, వెంకటరమణ, గురుదేవిలపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో కౌన్సిలర్స్ షేక్ షహనాజ్, వైసిపి వార్డు ఇంచార్జ్ షేక్ రహంతుల్లా అధ్వర్యంలో ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషాలు రూ.12 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు, డ్రైన్లు, కల్వర్టులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయమని, సమస్యలకు వెంటనే స్పందించి పరిష్కరిస్తామని తెలిపారు. వార్డులో ఉన్న ప్రధానంగా తాగునీటి సమస్యను పరిష్కరించామని, అక్కడక్కడ చిన్నపాటి సమస్యలు ఉన్నాయని వాటిని త్వరలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పామ్ షావలి, దృశ్య కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, ఎపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ డా.శశికళ రెడ్డి, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, వైసిపి కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్ పర్సన్, వార్డ్ కౌన్సిలర్